మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి
# ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 10-10-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 101 Issue: 101

10 అక్టోబర్ 2025 - శుక్రవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు ఆశ్వయుజ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:11 సూర్యాస్తమయం - సా. 5:54 తిథిః చవితి రా. 7:42 వరకు తరువాత పంచమి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం కృతిక సా. 5:33 వరకు తరువాత రోహిణి యోగం సిద్ధి సా. 5:39 వరకు కరణం బవ ఉ. 9:16 వరకు భాలవ రా. 7:42 వరకు వర్జ్యం ఉ. 6:46 నుండి ఉ. 8:12 వరకు దుర్ముహూర్తం ఉ. 8:32 నుండి ఉ. 9:19 వరకు మ. 12:26 నుండి మ. 1:13 వరకు రాహుకాలం ఉ. 10:35 నుండి మ. 12:03 వరకు యమగండం మ. 2:58 నుండి సా. 4:26 వరకు గుళికాకాలం ఉ. 7:39 నుండి ఉ. 9:07 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:35 నుండి తె. 5:23 వరకు అమృత ఘడియలు మ. 3:21 నుండి సా. 4:47 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:39 నుండి మ. 12:26 వరకు

Published from Jagitial
www.evarthalu.com


## బీసీలతో ఆడుకుంటున్న పాలకులు

# వాటా.. వంచన



### చట్టం చేయకుండా రిజర్వేషన్ అసాధ్యం
### అది తెలిసీ జీవోలు, బిల్లులతో మోసం
### తాజాగా, బీసీ రిజర్వేషన్ జీవోపై హైకోర్టు స్టే
### ఇదే జరుగుతుందని ముందే చెప్పిన నిపుణులు
### అభ్యర్థులూ డబ్బులు జాగ్రత్త అంటూ ఈటల హితవు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్.. ఈ మాట అనగానే యావత్తు బీసీ లోకం సంబురపడింది. ఎన్నో ఏళ్లుగా అన్యాయానికి గురవుతున్న బీసీలకు న్యాయం జరగబోతోందని ఓ వర్గం ఊదరగొట్టింది. కానీ, అదంతా డ్రామా అని, చట్టం చేయకుండా 42 శాతం రిజర్వేషన్ అసాధ్యమని నిపుణులు మొత్తుకుంటూనే ఉన్నారు. అయినా, రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు 42 శాతం బిల్లును అసెంబ్లీలో పెట్టింది. అది గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉండేసరికి.. 42 శాతం రిజర్వేషన్ జీవోను తీసుకొచ్చింది. అయితే, శాసనసభ బిల్లులు, జీవోలు పనిచేయవని.. కేంద్రంలో చట్టం చేస్తేనే బీసీలకు మేలు జరుగుతుందని మేధావి వర్గాలు చెప్తూ వచ్చాయి. అన్నట్లుగానే తెలంగాణ హైకోర్టు బీసీ 42 శాతం రిజర్వేషన్ జీవో నంబర్ 9పై కత్తి పెట్టింది.

(ఈవార్తలు ప్రత్యేక ప్రతినిధి)

ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 9 తో పాటుగా స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ పైనా స్టే విధించింది. బీసీ రిజర్వేషన్ల పై హైకోర్టులో సుదీర్ఘ వాదనలు జరిగాయి. తొలి రోజు పిటిషనర్ల వాదనలు జరిగాయి. గురువారం ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. సమగ్ర సర్వే చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుందని తెలిపారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని అసెంబ్లీ నిర్ణయించిందని చెప్పారు. బీసీ బిల్లుపై ఒక్క పార్టీ కూడా అభ్యంతరం తెలపలేదని గుర్తు చేశారు. అయినా, స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిన తరువాత నిలుపుదల చేసే అవకాశం లేదని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లు చేసిన విధానాన్ని కోర్టుకు వివరించారు. ప్రభుత్వం చేపట్టిన సర్వేలో 57.6 శాతం బీసీ జనాభా ఉందని తేలిందని హైకోర్టుకు ఏజీ సుదర్శన్‌రెడ్డి వివరించారు. సర్వే డేటా ఆధారంగానే రిజర్వేషన్లు ఖరారు చేశారని పేర్కొన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని అసెంబ్లీ తరువాయి 2 వ పేజీలో...




# పొద్దున నోటిఫికేషన్ సాయంత్రం స్టే

### ఎంపీటీసీ, జడ్పీటీసీ తొలి విడతకు ఈసీ నోటిఫికేషన్

**హైకోర్టు 'స్టే' ఆదేశాలతో ఈసీ నిర్ణయానికి బ్రేక్**

**నోటిఫికేషన్ రద్దు చేస్తున్నట్లు ఈసీ గెజిట్ విడుదల**

స్థానిక ఎన్నికలకు ఇక అంతా సిద్ధం అనుకున్నారు.. కోర్టు నుంచి సానుకూల ప్రకటనే వస్తుందని ఆశపడ్డారు.. ఆ ఆశతోనే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం నోటిఫి కేషన్ కూడా జారీ చేసింది. కానీ, సాయంత్రానికి అంతా ఆవిరైంది.

హైదరాబాద్, అక్టోబర్ 9 (ఈవార్తలు): గురువారం మధ్యాహ్నం హైకో ర్టులో వాదనలు ఉన్నాయని, కోర్టు నిర్ణయం వెలు వరిస్తుందని తెలిసినా.. ఎన్నికల సంఘం తొందరపడి కూత కూసింది. కానీ, ఆ కూతకు హైకోర్టు బ్రేకులు వేసింది. గురువారం తరువాయి 2 వ పేజీలో...

### రాజకీయ లాభం కోసం కాంగ్రెస్ డ్రామాలు



ప్రజలకు నిజమైన లబ్ధి చేకూర్చే ఉద్దేశం కాంగ్రెస్‌కు లేదు. రాజకీయ లాభాల కోసం అసంబద్ధ బిల్లులు, జీవోలు తెచ్చి ప్రజలతో డ్రామా చేస్తోంది. బీసీ వర్గాల ఆత్మాభిమానాన్ని కేవలం ఓటు బ్యాంక్‌గా ఉపయోగించుకునే ప్రయత్నమే ఇది.

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

### కాంగ్రెస్‌ది రిజర్వేషన్ల డ్రామా



బీసీలకు రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ డ్రామా ఆడుతోంది. బీసీలను మరోసారి మోసం చేసేందుకు కుట్ర పన్నింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టినట్లే, ఇప్పుడు 42 శాతం బీసీ రిజర్వేషన్ల పేరుతో మరో డ్రామాకు తెరతీశారు. రిజర్వేషన్ల కోసం గల్లీలో కాకుండా ఢిల్లీలో పోరాడాలి.

- మాజీమంత్రి హరీశ్ రావు

### బీఆర్ఎస్‌దే ఈ పాపం



2018లో బీఆర్ఎస్ ప్రభుత్వం రిజర్వేషన్ పరిమితిని 50 శాతం కటాఫ్ చేసి చట్టం చేసింది. ఆ సమయంలో వారు ఓబీసీ రిజర్వేషన్‌పై ఎలాంటి కసరత్తు చేయలేదు. దాని ఫలితంగానే ఇప్పుడు హైకోర్టులో బీసీ రిజర్వేషన్లకు ఎదురుదెబ్బ తగిలింది.

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

### రిజర్వేషన్ పేరిట బీసీలకు మోసం



బీసీలకు రిజర్వేషన్ అంశంలో రేవంత్ రెడ్డి విధానాలు తప్పు. కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీలంటే చిత్తశుద్ధి లేదు. రిజర్వేషన్ పేరిట బీసీలను మోసం చేస్తోంది. శుక్రవారం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మలను టీఆర్పీ శ్రేణులు దహనం చేయాలి. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు పిలుపునిస్తున్నాం.

- తీన్మార్ మల్లన్న

---

సమాచార హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్న ఉత్తమ జిల్లాగా కరీంనగర్ తొలి స్థానంలో నిలిచింది. మెదక్, జనగామ జిల్లాలు వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. అత్యుత్తమ శాఖాధిపతిగా జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తొలి స్థానంలో, సీడీఎం ఏ శ్రీదేవి రెండో స్థానంలో, ఎక్సైజ్ శాఖ కమిషనర్ రవికిషన్ మూడో స్థానంలో ఉన్నారు.

### బంగారం-వెండి ధరలు



| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,393 |
| వెండి (గ్రాము): | రూ.170 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,732 |

### విశ్వవాణి



బొప్పాయి చెట్లను నాటిన 6-12 నెలల్లోనే పండ్లు కాస్తాయి. ఉష్ణ మండల ప్రాంతాల్లో అత్యంత వేగంగా పెరిగే పండ్లు ఇవే.



# ఆర్టీసీని ప్రైవేటుపరం చేస్తారా?

**కార్గోను ప్రైవేటీకరించారు... వెంటనే చార్జీలు తగ్గించాలి.. ఆర్టీసీ ఎండీతో కేటీఆర్, హరీశ్**

ఆర్టీసీ ఛార్జీల పెంపునకు నిరసనగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చలో బస్ భవన్ కార్యక్రమం నిర్వహించారు. కేటీఆర్ తలసాని, పద్మారావు రేతిఫైల్ బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కిన ఆర్టీసి క్రాస్ రోడ్ బస్ భవన్‌కు చేరుకున్నారు. మరోవైపు.. హరీష్‌రావు మెహిదీపట్నం నుంచి బస్సులో ప్రయాణించారు. ఈ నేపథ్యంలో పోలీసులు భారీగా బందోబస్తు నిర్వహించారు. బస్ భవన్ లోపలికి వెళ్లేందుకు ఎమ్మెల్యేలకు మాత్రమే అనుమతిచ్చారు. కేటీఆర్, హరీశ్ రావు, తలసాని, పద్మారావు, పలువురు ఎమ్మెల్యేలు బస్ భవన్ లోపలకి వెళ్లారు. ఆర్టీసీ ఎండీని నాగిరెడ్డిని కలిశారు.

ఆర్టీసీ క్రాస్‌రోడ్స్/హైదరాబాద్, అక్టోబర్ 9 (ఈవార్తలు): ఛార్జీలు తగ్గించాలని పార్టీ తరపున లేఖ అందజేశారు. ప్రభుత్వ బకాయిలపై వివరాలు అడిగిన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగిరెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నలతో ముంచెత్తారు. కార్గోను ప్రైవేట్ పరం చేశారని.. త్వరలో ఆర్టీసీని సైతం ప్రైవేట్ పరం చేస్తారా? అని అడిగారు. అలాంటి నిర్ణయం తీసుకోలేని ఎండీ నాగిరెడ్డి వివరించారు. కాగా.. అంతకు ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కేటీఆర్, హరీష్‌రావులను పోలీసులు తరువాయి 2 వ పేజీలో...

# గాజాలో శాంతి

### ఇజ్రాయెల్-హమాస్ మధ్య ఒప్పందం

### అపూర్వ అడుగు: డోనాల్డ్ ట్రంప్



గాజా: గాజా సంక్షోభంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. యుద్ధం ముగించేందుకు ఇజ్రాయెల్, హమాస్ ముందుకు వచ్చాయి. మొదటి దశ శాంతి ఒప్పందానికి అంగీకరించినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. రెండేళ్ల గాజా యుద్ధాన్ని ముగింపు పలికేందుకు ఇదొక అపూర్వ అడుగుగా ట్రంప్ అభివర్ణించారు. ఒప్పందంపై ఇరు పక్షాలు సంతకం చేసినట్లు ఈ మేరకు తన సోషల్ మీడియా 'ట్రూత్'లో ట్రంప్ పోస్టు చేశారు. 'గాజా మొదటి దశ శాంతి ఒప్పందానికి ఇజ్రాయెల్, హమాస్‌లు తరువాయి 2 వ పేజీలో...

# జాన్సన్ పౌడర్‌తో కేన్సర్

### 8,500 కోట్లు పరిహారం చెల్లించండి.. అమెరికా కోర్టు కీలక ఆదేశాలు




అమెరికాకు చెందిన జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీకి లాస్ ఏంజెలెస్ జూరీ భారీ జరిమానా విధించింది. వారు తయారు చేసిన బేబీ పౌడర్ ఉత్పత్తుల కారణంగా క్యాన్సర్ వస్తున్నట్టు నిర్ధారణ అయ్యిందని, అది వాడి మెసోథెలియోమా వ్యాధికి గురై మరణించిన ఒక మహిళ కుటుంబానికి రూ.8,577 కోట్లు పరిహారంగా చెల్లించాలని తీర్పు చెప్పింది.

వివరాల్లోకి వెళితే.. కాలిఫోర్నియాకు చెందని మే మూర్ అనే మహిళ 2021లో తన 88వ ఏట మరణించింది. అయితే జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ టాల్క్ బేబీ పౌడర్ ఉత్పత్తులను మూర్ వాడిందని, దానిలో ఉన్న ఆస్‌బెస్టాస్ ఫైబర్ కారణంగా ఆమె అరుదైన క్యాన్సర్‌కు గురైందని ఆమె కుటుంబ సభ్యులు అదే ఏడాది దావా వేశారు. తమ కంపెనీ ఉత్పత్తులు పూర్తి సురక్షితమైని, అందులో ఎలాంటి ఆస్‌బెస్టాస్ లేదని, ఎలాంటి క్యాన్సర్ కారకాలు లేవని కంపెనీ తరువాయి 2 వ పేజీలో...



# జగిత్యాల ఆర్డీవో కార్యాలయ సామగ్రి జప్తు

### రైతులకు పరిహారం చెల్లించకపోవడంపై కోర్టు ఆగ్రహం

జగిత్యాల టౌన్, అక్టోబర్ 9 (ఈవార్తలు): జగిత్యాల ఆర్డీవో కార్యాలయంలోని సామగ్రిని జప్తు చేశారు అధికారులు. రైతులకు సరైన పరిహారం చెల్లించకపోవడంతో ప్రభుత్వ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన జగిత్యాల కోర్టు.. వెంటనే కార్యాలయ సామగ్రిని జప్తు చేయాలని ఆదేశించింది. వివరాల్లోకెళితే.. పెద్దపల్లి-నిజామాబాద్ రైల్వేలైన్ కోసం 2006లో రైతుల నుంచి సుమారు 100 ఎకరాలు భూమిని సేకరించారు. రైతులకు ఒక్క ఎకరాకు తరువాయి 2 వ పేజీలో...


2

### జీడిమెట్లలో 72 కోట్ల డ్రగ్స్ స్వాధీనం

పట్టుబడ్డ 220 కిలోల ఎఫెడ్రిన్


2

### హంగేరియన్ రచయితకు సాహిత్య నోబెల్

రచనలతో కళల శక్తిని చాటినందుకు ప్రకటన


2

### ప్రతి ఇంటికి ప్రభుత్వ ఉద్యోగ చట్టం

20 నెలల్లోనే ఇస్తానంటున్న తేజస్వీ


2

### అత్యంత సంపన్నుడు ముకేశ్ అంబానీ

ఫోర్బ్స్ కుబేరుల జాబితా విడుదల

# రాశి ఫలాలు

10.10.2025

మేషం: భాగస్వామ్య వ్యాపారాలు మధ్య స్వల్ప విభేదాలు ఉంటాయి. ఆరోగ్యం విషయంలో చికాకులు తప్పవు. వాహనాలు ప్రయాణ విషయంలో జాగ్రత్త అవసరం ఆర్థిక పరిస్థితి కొంత నిరాశ పరుస్తుంది. ఉద్యోగులకు నూతన సమస్యలు కలుగుతాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి.

వృషభం: నూతన కార్యక్రమాల ప్రారంభానికి అవరోధాలు తొలగుతాయి. అన్ని రంగాల వారికి అనుకూల ఫలితాలు ఉంటాయి. ఉద్యోగస్తులకు శుభవార్తలు అందుతాయి. దైవ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆర్థిక పరిస్థితి అనుకూలిస్తుంది. చిన్ననాటి మిత్రుల నుంచి కీలక సమాచారం అందుతుంది.

మిథునం: వ్యాపారమున ఎంతగా శ్రమించినా ఫలితం లభించక నిరాశ కలుగుతుంది. గృహమున పెద్దల ఆరోగ్య విషయం ఆందోళన కలిగిస్తుంది. బంధువులతో స్వల్ప వివాదాలు కలుగుతాయి. ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. ఇతరులకు ధన వ్యవహారాలలో మాట ఇవ్వకపోవడం మంచిది.

కర్కాటకం: మొండి బాకీలు తీర్చగలుగుతారు. కొత్త విషయాలు తెలుసుకుంటారు. నూతన ఆలోచనలు అమలు చేస్తారు. వ్యాపారాలు, ఉద్యోగాలు సంతృప్తికరంగా సాగుతాయి. ఆస్తి వివాదాలు కొలిక్కి వస్తాయి. ఆర్థిక వ్యవహారాలు అనుకూలిస్తాయి. ప్రారంభించిన పనులు నిదానంగా సాగుతాయి.

సింహం: ఉద్యోగమున అధికారుల అనుగ్రహం కలుగుతుంది. నూతన ఉద్యోగ అవకాశములు అందుతాయి. వ్యాపారాలు సజావుగా సాగుతాయి ముఖ్యమైన వ్యవహారాలలో కీలక నిర్ణయాలు కలసివస్తాయి. విలువైన వస్త్రా, ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

కన్య: ఉద్యోగ విషయమై అధికారులతో చర్చలు అంతగా అనుకూలించవు. వృధా ఖర్చుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. నిరుద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహపరుస్తాయి. రాజకీయ సభ సమావేశాలకు ఆహ్వానాలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి కొంత వరకు అనుకూలిస్తుంది.

తుల: దూర ప్రాంతాల బంధు మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ఇతరుల వ్యవహారాలకు దూరంగా ఉండటం మంచిది. వాహన ప్రయాణాలు వాయిదా పడుతాయి. వ్యాపారమున భాగస్థులతో జాగ్రత్తగా మాట్లాడటం మంచిది.

వృశ్చికం: నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. ఉద్యోగమున కొంత అనుకూలత కలుగుతుంది. దాయాదులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. చేపట్టిన పనులలో జాప్యం కలిగిన సకాలంలో పూర్తి చేస్తారు. బంధు మిత్రుల ప్రవర్తన కొంత చికాకు పరుస్తుంది.

ధనస్సు: కుటుంబ సభ్యులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. ఆర్థిక పరిస్థితి అనుకూలిస్తుంది. ప్రయాణాలలో కొంత జాగ్రత్త అవసరం ఋణాలు వసూలవుతాయి. నిరుద్యోగులు లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. వృత్తి ఉద్యోగమున ఆశించిన స్థానచలనాలు కలుగుతాయి.

మకరం: అన్ని రంగాల వారికి అనుకూల వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు కీలక సమాచారం అందుతుంది. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. ఉద్యోగులకు అదనపు పని బాధ్యతలు చికాకు కలిగిస్తాయి. దైవ సేవ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

కుంభం: ప్రముఖులతో పరిచయాలు లాభసాటిగా సాగుతాయి. శత్రువులు సైతం మిత్రులుగా మరి సహాయ పడతారు. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు సజావుగా సాగుతాయి. ఆర్థిక ఇబ్బందుల నుంచి తెలివిగా బయటపడతారు. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

మీనం: సమాజంలో ప్రముఖుల పరిచయాలు ఉత్సహాన్నిస్తాయి. నూతన కార్యక్రమాలు ప్రారంభానికి అవరోధాలు తొలగుతాయి. వృత్తి, వ్యాపారాలలో ఎదురైనా సమస్యలు తెలివిగా అధిగమిస్తారు. సోదరుల నుంచి కీలక సమాచారం అందుతుంది. రావలసిన సొమ్ము సకాలంలో. చేతికి అందుతుంది.

# ప్రతి ఇంటికి ప్రభుత్వ ఉద్యోగ చట్టం



## 20 నెలల్లోనే ఇస్తానంటున్న తేజస్వీ యాదవ్

పాట్నా: బీహార్ లో ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో పొలిటికల్ హీట్ పీక్స్ కి చేరింది. నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో జరగనున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రధాన పార్టీలన్నీ ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో ప్రతిపక్ష నేత తేజస్వి యాదవ్ కీలక ప్రకటన చేశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు తేజస్వి యాదవ్. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 రోజుల్లోనే ఇందుకు సంబంధించిన ఆర్డినెన్స్ తీసుకొస్తామని అన్నారు. వచ్చే నెలలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో మహాఘట్ బంధన్ అధికారంలోకి ప్రతి ఇంటి నుండి ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు తేజస్వి యాదవ్. గురువారం ( అక్టోబర్ 9 ) మీడియా సమావేశంలో పాల్గొన్న ఆయన ఈమేరకు కీలక ప్రకటన చేశారు.తమ ప్రభుత్వం ఏర్పడిన 20 రోజుల్లోపు ఉపాధికి హామీ ఇచ్చే కొత్త చట్టాన్ని ప్రవేశపెడతామని ప్రకటించారు. అధికారం చేపట్టిన 20 నెలల్లోపు ఈ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా పూర్తిగా అమలు చేస్తామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఉండేలా చూస్తామని, ప్రభుత్వం ఏర్పడిన 20 రోజుల్లోపు కొత్త చట్టం రూపొందిస్తామని అన్నారు. 20 నెలల్లో ప్రభుత్వ ఉద్యోగం లేని ఇల్లు లేకుండా చేస్తామన్నారు. డేటా ఆధారంగానే తాను హామీ ఇచ్చానని.. ఇది జుమ్లా వాగ్దానం కాదని అన్నారు. బీహార్ ప్రజలు ఈసారి మార్పును కోరుకుంటున్నారని పేర్కొన్నారు.

## ఉద్యోగినులకు నెలసరి సెలవు

### కర్ణాటక సర్కారు కీలక నిర్ణయం

బెంగళూరు: మహిళా ఉద్యోగులకు నెలసరి సెలవు ఇచ్చేందుకు కర్ణాటక ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి నెలా వేతనంతో కూడిన ఒక సెలవు మంజూరు చేసేందుకు నిర్ణయించింది. ఈ మేరకు కీలక ప్రతిపాదనకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రభుత్వ మహిళా ఉద్యోగుల, వస్త్ర పరిశ్రమ, బహుళజాతి కంపెనీలు, ఐటీ సంస్థలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇతర ప్రైవేటు రంగ సంస్థలన్నీ మహిళా ఉద్యోగులకు ప్రతి నెల వేతనంతో కూడిన ఒక నెలసరి సెలవు ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.మహిళా సిబ్బంది ఆరోగ్యం, శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. మహిళలకు అండగా ఉండి ప్రోత్సహించే పని వాతావరణం కల్పించడమే తమ ఉద్దేశమని పేర్కొంది. మహిళల శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందేలా ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించింది. ఈ చర్య ఎందరో మహిళలకు లాభం చేకూరుస్తుందని రాష్ట్ర న్యాయశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ అన్నారు. ఇప్పటికే బీహార్, ఒడిశా, కేరళ, సిక్కిమ్ రాష్ట్రాల్లో ఈ విధానం అమల్లో ఉంది. ఇక ప్రభుత్వ పాలసీలతో నిమిత్తం లేకుండా కొన్ని ప్రైవేటు సంస్థలు ఇప్పటికే వేతనంతో కూడిన నెలసరి సెలవులు ఇస్తున్నాయి. జొమాటో, స్విగ్గీ, ఎల్ అండ్ టీ వంటి సంస్థల్లో నెలసరి సెలవుల వెసులుబాటు ఉంది. అయితే, అసంఘటిత రంగంలో ఇలాంటి సంస్కరణలు అమలు చేయడం ఇంకా సవాలుగానే ఉందని మహిళా హక్కుల సంఘాలు చెబుతున్నాయి.

## హంగేరియన్ రచయితకు సాహిత్య నోబెల్

### రచనలతో కళల శక్తిని చాటినందుకు ప్రకటన

స్టాక్‌హోం: సాహిత్య రంగంలో ఈ ఏడాది నోబెల్ బహుమతి హంగేరియన్ రచయిత లాస్లో క్రాస్నహోర్కైని వరించింది. ఆయన విలక్షణమైన, దార్శనిక రచనలకు ఈ అత్యున్నత పురస్కారం దక్కినట్లు స్వీడిష్ అకాడమీ గురువారం అధికారికంగా ప్రకటించింది. ప్రపంచ వినాశనం వంటి తీవ్ర భయానక పరిస్థితుల మధ్య కూడా కళకు ఉన్న అపారమైన శక్తిని తన రచనల ద్వారా బలంగా చాటి చెప్పినందుకు గాను లాస్లోకు ఈ గౌరవం అందిస్తున్నట్లు నోబెల్ కమిటీ తన ప్రకటనలో పేర్కొంది. ఆయన సాహిత్యం సమకాలీన ప్రపంచంలోని సంక్లిష్టతలను, మానవ అస్తిత్వ వేదనను వినూత్న శైలిలో ఆవిష్కరిస్తుందని ప్రశంసించింది. లాస్లో క్రాస్నహోర్కై తన రచనలతో ఆధునిక సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఇప్పుడు నోబెల్ బహుమతితో ఆయన కీర్తి విశ్వవ్యాప్తమైంది.

## అత్యంత సంపన్నుడు ముకేశ్ అంబానీ

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ మరోసారి ఫోర్బ్స్ కుబేరుల జాబితాలో అగ్రస్థానంలో నిలిచారు. ఫోర్బ్స్ తాజాగా విడుదల చేసిన భారత్‌లోని 100 మంది సంపన్నుల జాబితాలో ముకేశ్ అంబానీ ఫస్ట్ ప్లేస్‌ను సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం ఆయన సంపద 105 బిలియన్ డాలర్లుగా ఉంది. గతేడాదితో పోలిస్తే ముకేశ్ సంపద 12 శాతం క్షీణించింది. ముకేశ్ అంబానీ తర్వాత 92 బిలియన్ డాలర్లతో గౌతమ్ అదానీ రెండో స్థానంలో ఉన్నారు. ఓపీ జిందాల్‌కు చెందిన సావిత్రి జిందాల్ 40 బిలియన్ డాలర్లతో మూడోస్థానంలో, టెలికం దిగ్గజం సునీల్ మిట్టల్ 34 బిలియన్ డాలర్లతో నాలుగో స్థానంలో, టెక్ బిలియనీర్ శివ నాడార్ 33 బిలియన్ డాలర్లతో ఐదో స్థానంలో నిలిచారు. 2025 ఫోర్బ్స్ జాబితాలో 100 మంది దేశీయ కుబేరుల సంపద విలువ 9 శాతం (100 బిలియన్ డాలర్లు) పడిపోయి 1 ట్రిలియన్ డాలర్లకు చేరింది.



## జీడిమెట్లలో 72 కోట్ల డ్రగ్స్ స్వాధీనం

### పట్టుబడ్డ 220 కిలోల ఎఫెడ్రిన్

జీడిమెట్ల/హైదరాబాద్, అక్టోబర్ 9 (ఈవార్తలు): డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్న తెలంగాణ ఈగల్ టీం.. ఎక్కడికక్కడ తనిఖీలు, మెరుపు దాడులతో డ్రగ్స్ మహమ్మారిని కట్టడి చేస్తోంది. తాజాగా, హైదరాబాద్ లోని జీడిమెట్లలో భారీగా డ్రగ్స్ పట్టుకుంది. 220 కిలోల ఎఫెడ్రిన్ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ విలువ అంతర్జాతీయ మార్కెట్లో రూ.72 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. నలుగురు నిందితులు అరెస్టు చేయగా ఒకరు పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. హైదరాబాద్ లో ప్రముఖ రసాయన పరిశ్రమలలో తయారు చేసినట్లు గుర్తించారు పోలీసులు. ఎఫెడ్రిన్ తయారీకి బిగ్ స్కేల్ కెమికల్ యూనిట్ వినియోగించినట్లు గుర్తించారు. డ్రగ్ తయారీలో ప్రధాన నిందితుడు శివ రామకృష్ణగా ఉన్నట్లు గుర్తించారు. డ్రగ్ తయారీకి వాడిన ఫార్ములా సైతం స్వాధీనం చేసుకున్నారు. కాగా, సెప్టెంబర్ 5న చర్లపల్లి ఇండస్ట్రియల్ కారిడార్ లోకెమికల్ ఫ్యాక్టరీ కేంద్రంగా, ఎండీ (మెఫెడ్రోన్) అనే మాదకద్రవ్యాలను ఉత్పత్తి చేస్తున్నట్లు గుర్తించిన ఈగల్ టీం.. సుమారు రూ.12 వేల కోట్ల విలువైన నిషేధిత డ్రగ్స్‌ను కూడా స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే.



## ఆర్టీసీని ప్రైవేటుపరం చేస్తారా?

మొదటి పేజీ తరువాయి

హౌస్ అరెస్ట్ చేశారు. తనతోపాటు, బీఆర్ఎస్ నాయకుల ఇళ్ల ముందు భారీగా పోలీసుల మోహరింపుపై కేటీఆర్ స్పందించారు. "పెంచిన చార్జీలకు వ్యతిరేకంగా శాంతియుతంగా ఆర్టీసీ ఎండీ కార్యాలయంకి వెళ్లి ఒక లేఖ ఇద్దామని పార్టీ పిలుపునిచ్చింది. చార్జీలను వెనక్కి తీసుకోవాలని కోరాలని అనుకున్నాం. ఆర్టీసీ బస్సులు ఎక్కి వెళ్తా అంటే భారీగా పోలీసులను ప్రభుత్వం ఇంటి ముందు మోహరించింది. ఒక వ్యక్తిని బస్సు ఎక్కకుండా ఆపడం కోసం ఇంతమంది పోలీసులను పంపారు. మమ్మల్ని నియంత్రించడంలో పోలీసులకు ఉన్న ఉత్సాహం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో జరుగుతున్న నేరాల అదుపులో చూపిస్తే మంచిది. ఎన్ని రకాల కుట్రలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సు చార్జీలను వెనక్కి తీసుకొనే దాకా నిరసన తెలుపుతూనే ఉంటాం. ఇలాంటి పోలీసు నిర్బంధాలు మాకు, మా పార్టీకి కొత్త కాదు." అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

## వాటా వంచన

మొదటి పేజీ తరువాయి

నిర్ణయించిందని చెప్పారు. దీనికి కొనసాగింపుగా..బీసీ బిల్లుపై ఒక్క పార్టీ కూడా అభ్యంతరం తెలపలేదని గుర్తు చేశారు. రాష్ట్రపతి బిల్లుకు ఆమోదం తెలపలేదు కాబట్టి.. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం బిల్లు ఆమోదం పొందినట్టే అని వివరించారు. ఒక వేళ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం తెలిపి ఉంటే అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫై చేసి ఉండేదని అన్నారు. మార్చి నుంచి గవర్నర్ దగ్గర బిల్లు పెండింగ్‌లో ఉందని తెలిపారు. గవర్నర్ గడువులోపు ఆమోదించకపోతే చట్టంగా భావించాల్సి ఉంటుందని సుదర్శన్‌రెడ్డి తెలిపారు. బిల్లును అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించిందా? అని హైకోర్టు ఏజీని ప్రశ్నించింది. ఆమోదించిందని సమాధానం ఇచ్చారు. వాదనల తరువాత హైకోర్టు రిజర్వేషన్ల పైన జారీ చేసిన జీవో నెంబర్ 9 తో పాటుగా ఈ జీవో ఆధారంగా జారీ చేసిన స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ పైనా స్టే విధిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. గత కొన్ని రోజులుగా బీసీ మేధావులు చెప్తున్నట్లే హైకోర్టు జీవోపై స్టే విధించడం గమనార్హం. ఆ జీవో చెల్లదని మేధావి వర్గం చెప్తున్నా, ప్రభుత్వం మొండిగా ముందడుగు వేసింది. జీవో ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘానికి సిఫార్సు చేసింది. ఎన్నికల సంఘం కూడా ప్రభుత్వ నిర్ణయం మేరకు నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. కానీ, అవన్నీ వ్యర్థమే అయ్యాయి.

## జాన్సన్ పౌడర్‌తో కేన్సర్

మొదటి పేజీ తరువాయి

కోర్టులో వాదించింది. దీనితో విభేదించిన జూరీ.. బాధితురాలి కుటుంబానికి 966 మిలియన్ డాలర్లు నష్టపరిహారం చెల్లించాలని తీర్పు చెప్పింది. కాగా, ఈ తీర్పు దారుణం, రాజ్యాంగ విరుద్ధమని జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఎరిక్ హాస్ పేర్కొన్నారు. దీనిపై తాము ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్టు తెలిపారు.

అనేక వివాదాలు:

జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ తయారు చేసే బేబీ పౌడర్ వల్ల కేన్సర్ ముప్పు ఉందనే ఆరోపణలు ప్రపంచవ్యాప్తంగా పెద్ద వివాదంగా మారాయి. ఈ పౌడర్‌లో ఆస్‌బెస్టాస్ అనే కార్సినోజెన్ (కేన్సర్ కారకం) ఉండటం వల్ల ఓవరియన్ కేన్సర్, మెసోథెలియోమా వచ్చే ప్రమాదం ఉందని పలు అధ్యయనాలు, కోర్టు తీర్పులు నిర్ధారించాయి. ఈ వివాదం 1970ల నుంచి కొనసాగుతూ, ఇటీవల అమెరికాలో భారీ జరిమానాలకు దారితీసింది. భారత్‌లో కూడా లైసెన్స్ రద్దు, కోర్టు కేసులు జరిగాయి. మహిళలు ఈ పౌడర్‌ను అందాలు, ప్రైవేట్ పార్ట్స్‌లో ఉపయోగించటం వల్ల ఓవరియన్ కేన్సర్ ప్రమాదం 30 శాతం పెరుగుతుందని అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అధ్యయనాలు పేర్కొన్నాయి. భారత్‌లోనూ 2022లో మహారాష్ట్ర ఎఫ్‌డీఏ, ఈ పౌడర్ పీహెచ్ విలువలు అనుకూలంగా లేకపోవటం వల్ల శిశువుల చర్మానికి ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉందని లైసెన్స్ రద్దు చేసింది. పుణె, నాసిక్‌లో సేకరించిన నమూనాలు లోపాలతో ఉన్నాయని నిర్ధారించారు. జాన్సన్ అండ్ జాన్సన్ 2023లో అమెరికాలో టాల్క్ పౌడర్ అమ్మకాలు ఆపేసింది, కానీ ఇతర దేశాల్లో కొనసాగుతున్నాయి.

## పొద్దున నోటిఫికేషన్‌సాయంత్రం స్టే

మొదటి పేజీ తరువాయి

ఉదయం 10.30 గంటలకు ఎంపీటీసీ, జడ్పీటీసీ తొలి విడత ఎన్నికల నామినేషన్ ప్రారంభిస్తున్నట్లు ప్రక టించింది. రాష్ట్రంలోని 2,963 ఎంపీటీసీ స్థానాల కు, 292 జడ్పీటీసీ స్థానాలకు నామినేషన్లను స్వీకరించనున్నట్లు వెల్లడించింది. ఈ నెల 11 వరకు నామినేషన్లను స్వీకరిస్తామని తెలిపింది. కానీ, సాయంత్రం హైకోర్టు ఆ నోటిఫికేషన్‌కు బ్రేకులు వేయడంతో ఈసీ నిర్ణయానికి భంగపాటు తప్పలేదు. దాంతో.. హైకోర్టు ఆదేశాలను పాటిస్తామని చెప్పుకోవాల్సి వచ్చింది. మళ్లీ గురువారం రాత్రికి స్థానిక సంస్థల నోటిఫికేషన్ రద్దు చేస్తున్నట్లు గెజిట్ విడుదల చేసింది. తదుపరి నోటిఫికేషన్ వచ్చే వరకు నిలిపివేస్తున్నట్లు పేర్కొంది.

## జగిత్యాల ఆర్డీవో కార్యాలయ సామగ్రి జప్తు

మొదటి పేజీ తరువాయి

కేవలం రూ.లక్షా 30 వేలు మాత్రమే అధికారులు చెల్లించారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు కోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన కోర్టు రైతులకు అండగా నిలిచింది. ఒక్కో ఎకరాకు రూ.లక్షా 30 వేలు కాదని, రూ.15,97,200 చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, కోర్టు ఉత్తర్వులు జారీ చేసినా రైతులకు పరిహారం చెల్లించడంలో ఆర్డీవో అధికారులు విఫలం అయ్యారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన కోర్టు.. ఆర్డీవో కార్యాలయ సామగ్రిని జప్తు చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

## విద్య, ఉద్యోగవాణి

**791 పోస్టులకు స్క్రీనింగ్ టెస్ట్ ఫలితాలు విడుదల**

ఏపీ అటవీశాఖలో ఫారెస్టు బీట్ ఆఫీసర్, అసిస్టెంటు బీట్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నిర్వహించిన స్క్రీనింగ్ టెస్టు ఫలితాలను ఏపీపీఎస్సీ విడుదల చేసింది. సెప్టెంబర్ 7న ఈ పరీక్షలు నిర్వహించారు. మెయిన్స్‌కు ఏఫ్‌యస్‌ఓకు 2,346, ఏఫ్బీఓ, ఏబీఓలకు 13,845 మంది అర్హత సాధించినట్లు కమిషన్ పేర్కొంది. ఏఫ్‌యస్‌ఓలో 100, ఏఫ్బీఓలో 691 పోస్టులు భర్తీ చేయనున్నారు.

**7,267 ఉద్యోగాలు**

ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో 7,267 టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులకు దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతుంది. పీజీటీ, టీజీటీ, వార్డెన్, స్టాఫ్, నర్స్ తదితర పోస్టులున్నాయి. ఉద్యోగాలను బట్టి పీజీ, బీఎడ్, డిగ్రీ, బీఎస్సీ నర్సింగ్, ఇంటర్, టెన్త్ పాసైన వారు అర్హులు. చివరి తేదీ అక్టోబర్ 23, 2025 వరకు. వెబ్‌సైట్: ప్ట్జూం://అవర్ర్.తీఅఋశ్రీ.స్త్ర శీజ.అఅ

# గాజాలో శాంతి



మొదటి పేజీ తరువాయి

అంగీకరించినందుకు గర్వంగా భావిస్తున్నాను. ఈ నిర్ణయంతో హమాస్ చేతిలో బందీగా ఉన్న వారందరూ త్వరలోనే విడుదల అవుతారు. ఇజ్రాయెల్ తన బలగాలను వెనక్కి తీసుకుంటుంది. దీర్ఘకాలికమైన శాంతిని సాధించే క్రమంలో సైనికుల ఉపసంహరణ తొలి అడుగుగా నిలిచిపోతుంది. అన్ని పార్టీలను సమంగా చూస్తాం. అరబ్, ముస్లిం ప్రపంచం, ఇజ్రాయెల్, ఇతర చుట్టు పక్కల దేశాలకు, అమెరికాకు ఇది ఎంతో గొప్ప రోజు. ఈ చరిత్రాత్మక, అపూర్వసంఘటన. ఇది నెరవేరడానికి మాతో పాటు కలిసి పని చేసిన మధ్యవర్తులు ఖతార్, ఈజిప్ట్, తుర్కియేకు థ్యాంక్స్' అని ట్రంప్ పేర్కొన్నారు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్ సరిహద్దులో హమాస్ మిలిటెంట్లు విరుచుపడి 1,200 మందికిపైగా హతమార్చి, 250 మందికిపైనే బందీలుగా చేసుకున్నారు. దీంతో హమాస్ అంతమే లక్ష్యంగా ఇజ్రాయెల్ బలగాలు గాజాపై భీకరంగా విరుచుకుపడి హమాస్ ముఖ్య నేతలందరినీ హతమార్చింది. ఈ రెండేళ్ల యుద్ధంలో 67 వేలమందికిపైగా పాలస్తీనీయులు ప్రాణాలు కోల్పోయారు. 1.70 లక్షలమంది గాయపడ్డారు. లక్షకుపైగా భవనాలు నేలమట్టమయ్యాయి. గాజా శాంతి ఒప్పందం కోసం 20 సూత్రాల ప్రణాళికను హమాస్ ముందు ఉంచారు. ఈ ప్రణాళికకు ఒప్పుకోకుంటే నరకం చూపిస్తానని ఇటీవల హెచ్చరించారు. మరోవైపు మూడు రోజులుగా శాంతి ప్రణాళికపై ఈజిప్టులో ఇజ్రాయెల్, హమాస్ మధ్య చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో మొదటి దశ అమలుకు ఇరు పక్షాలు అంగీకరించాయి. శాంతి ఒప్పందంపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పందిస్తూ.. ఈ నిర్ణయం ఇజ్రాయెల్‌కు గొప్పరోజుగా అభివర్ణించారు. ఈ ఒప్పందాన్ని ఆమోదించేందుకు, బందీలందరినీ ఇళ్లకు చేర్చేందుకు రేపు ప్రభుత్వాన్ని సమావేశపరుస్తానని పేర్కొన్నారు. ఇటు శాంతి ఒప్పందాన్ని హమాస్ ధ్రువీకరిస్తూ.. గాజాలో యుద్ధానికి ముగింపు పలికేందుకు ఈ ఒప్పందం దోహదం చేస్తుందని పేర్కొంది. ఈ ఒప్పందం కుదరడంలో కీలక పాత్ర పోషించిన ఖతార్, ఈజిప్టు, తుర్కియే, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు హమాస్ కృతజ్ఞతలు తెలిపింది. ఆక్రమిత ప్రాంతాల నుంచి ఇజ్రాయెల్ దళాల పూర్తి ఉపసంహరణ, మానవత సాయానికి అనుమతి, ఖైదీల మార్పిడి చోటుచేసుకోనుందని వెల్లడించింది. గాజా ప్రజలు సాటిలేని ధైర్యం, వీరత్వం ప్రదర్శించారని పేర్కొంది. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, స్వయం నిర్ణయాలు సాధించేవరకు తమ ప్రజల హక్కులను వదులుకోబోమని స్పష్టం చేసింది.

# బీసీ రిజర్వేషన్ ఓ డ్రామా

## కాంగ్రెస్ నాటకాలు ఆడుతోంది.. ఆరు గ్యారెంటీలలాగే బీసీలను మోసం చేసే యత్నం


**చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీ వేదికగా పోరాడాలి**

**సర్కారుపై మాజీమంత్రి హరీశ్ రావు ఫైర్**

హైదరాబాద్, అక్టోబర్ 9 (ఈవార్తలు): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవోపై హైకోర్టు స్టే విధించడం తెలిసిందే. ఈ పరిణామంపై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. బీసీలకు రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ డ్రామా ఆడుతోందని, బీసీలను మరోసారి మోసం చేసేందుకు కుట్ర పన్నిందని ధ్వజమెత్తారు. కేవలం ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే కాంగ్రెస్ పార్టీ ఇలాంటి ఎత్తుగడలు వేస్తోందని, వారి కుట్రలు ఇప్పుడు పటాపంచలయ్యాయని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టినట్లే, ఇప్పుడు 42 శాతం బీసీ రిజర్వేషన్ల పేరుతో మరో డ్రామాకు తెరతీశారని హరీశ్ రావు ఆరోపించారు. బీసీల పట్ల కాంగ్రెస్ పార్టీకి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని, 22 నెలలుగా ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గల్లీలో డ్రామాలు సృష్టిస్తున్నారు తప్ప, అసలు పోరాటం చేయాల్సిన ఢిల్లీలో మౌనంగా ఉన్నారని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలంటే, దానికి చట్టబద్ధత కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని, ఆ దిశగా రేవంత్ రెడ్డి ఎందుకు ఒత్తిడి తేవడం లేదని ఆయన ప్రశ్నించారు. కేవలం స్థానిక సంస్థల ఎన్నికలను ఆలస్యం చేసేందుకే ప్రభుత్వం తూతూమంత్రంగా జీవో ఇచ్చి చేతులు దులుపుకుందని హరీశ్ రావు ఆరోపించారు. "55 ఏళ్ల పాటు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, బీసీ రిజర్వేషన్ల కోసం ఏనాడూ చిత్తశుద్ధితో పనిచేయలేదు.



ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలోకి రాగానే బీసీలపై కపట ప్రేమ చూపిస్తోంది. మీకు నిజంగానే బీసీలపై ప్రేమ ఉంటే, మీ జాతీయ నాయకులతో కలిసి ఢిల్లీలో పోరాటం చేయండి. పార్లమెంటులో ఈ అంశంపై చట్టం చేయించి, దాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్పించండి. అప్పుడే బీసీలకు నిజమైన న్యాయం జరుగుతుంది" అని ఆయన సవాల్ విసిరారు. బీసీల హక్కుల కోసం ఢిల్లీ వేదికగా చేసే పోరాటంలో అఖిలపక్షాలను భాగస్వామ్యం చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఉద్యమ పార్టీగా బీఆర్ఎస్ ఎల్లప్పుడూ బీసీల పక్షాన నిలుస్తుందని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ఈ పోరాటానికి కాంగ్రెస్ పార్టీ కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి డ్రామాలు ఆపి, బీసీల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేయాలని హరీశ్ రావు హితవు పలికారు.



## సోలార్ ప్యానెళ్లు పెడితే రూ.కోటి

**తెలంగాణలోని 8 గ్రామాలకు కేంద్రం బంపరాఫర్**

**ములుగు జిల్లాలోని 8 గ్రామాలు ఎంపిక**

న్యూఢిల్లీ/హైదరాబాద్, అక్టోబర్ 9 (ఈవార్తలు): తెలంగాణలోని 8 గ్రామాలకు కేంద్ర ప్రభుత్వం ఓ బంపరాఫర్‌ను ప్రకటించింది. ఏకంగా కోటి రూపాయల బహుమతిని గెలుచుకునే అద్భుత అవకాశాన్ని కల్పించింది. సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో చేపట్టిన 'మోడల్ సోలార్ విలేజ్' పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ములుగు జిల్లాలోని ఎనిమిది గ్రామాలను కేంద్రం ఎంపిక చేసింది. ఈ గ్రామాల్లో అత్యధికంగా సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసుకున్న గ్రామానికి ఈ భారీ నజరానా దక్కనుంది. దేశవ్యాప్తంగా కరెంటు వాడకం రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై కేంద్రం దృష్టి సారించింది. ఇందులో భాగంగా 'ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోంది. తెలంగాణలో రెడ్కో (తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ) ద్వారా ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోంది. దీని కింద పైలట్ ప్రాజెక్ట్‌గా ములుగు జిల్లాలోని ములుగు, వెంకటాపూర్, గోవిందరావుపేట మండల కేంద్రాలతో పాటు పస్రా, చల్వాయి, మంగపేట, ఏటూరునాగారం, వెంటాపురం గ్రామాలను ఎంపిక చేశారు. గతేడాది మే నెలలో ఈ పథకంపై అధికారులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఫలితంగా, జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 400కు పైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 5 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామాలను ఈ ప్రాజెక్ట్ కోసం కేంద్రం పరిగణనలోకి తీసుకుంది. ఈ పథకం కింద సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు ప్రభుత్వం భారీగా సబ్సిడీ కూడా అందిస్తోంది.



## కాంగ్రెస్‌ది మోసం

**ఆ పార్టీవన్నీ యూటర్న్‌లే**

**కేంద్ర మంత్రి బండి సంజయ్**

హైదరాబాద్, అక్టోబర్ 9 (ఈవార్తలు): తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలను హైకోర్టు వాయిదా వేయడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు. ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. 'కాంగ్రెస్ తెలంగాణ ప్రజల విశ్వాసాన్ని తన మోసపూరిత ప్రయోగంగా మార్చుకుంది. గతంలో కూడా అనేకసార్లు ఇలాగే చేసింది. 2009 డిసెంబర్ 9 నాడు తెలంగాణను ప్రకటించి.. వెంటనే యూ టర్న్ తీసుకోవడం వల్ల 9 సంవత్సరాలు ప్రజల్లో నమ్మకం కోల్పోయింది. 2023 డిసెంబర్ 9 నాడు సోనియా గాంధీ పుట్టినరోజున ప్రమాణం చేయాలన్న రేవంత్ రెడ్డి వాగ్దానం, కానీ మళ్లీ వెనక్కు తగ్గాడు. %+ూ మీూ% 9: "బీసీ సాధికారత" చూపించాలన్న ఆవిష్కరణలో, బీసీల కోటాలో ముస్లింలను చేర్చి కాంగ్రెస్ బీసీలను మోసం చేయాలని ప్రయత్నించింది. 2025 అక్టోబర్ 9న హైకోర్టులో ప్రభుత్వం తమ ఆదేశాన్ని రక్షించలేకపోయింది. డేటా లేదు, రక్షణ లేదు, మోసం మాత్రమే ఉంది. డిసెంబర్ 9 నుంచి అక్టోబర్ 9 వరకు, కాంగ్రెస్ తెలంగాణ భావాలను, వెనుకబడిన వర్గాల ఆశలను దశాబ్దాలుగా రాజకీయ లాభాల కోసం వంచించింది.

# సుప్రీంకు సర్కారు?

**స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లపై హైకోర్టు స్టే**

**రిజర్వేషన్లు ఇచ్చి తీరతామని స్పష్టం చేసిన మంత్రి శ్రీహరి**

**బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కై అడ్డుకుంటున్నాయని ఆరోపణ**





హైదరాబాద్, అక్టోబర్ 9 (ఈవార్తలు): స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీలకు) 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్-9పై హైకోర్టు స్టే విధించడం తెలిసిందే. అయితే, ఈ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని, బీసీలకు ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరతామని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. హైకోర్టు తీర్పుతో బీసీ వర్గాలు ఏమాత్రం నిరాశ చెందవద్దని, ప్రభుత్వం వారికి అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ అంశంపై న్యాయపరంగా పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని తేల్చి చెప్పారు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి శ్రీహరి మాట్లాడారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచాలనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం ఈ చారిత్రక నిర్ణయం తీసుకుందని గుర్తుచేశారు. అయితే, ప్రతిపక్షాలు దీన్ని అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆయన తీవ్రస్థాయిలో ఆరోపించారు. "ఈ కేసు వేసింది బీఆర్ఎస్ పార్టీనే. బీసీలకు న్యాయం జరగకుండా అడ్డుకోవాలనే దురుద్దేశంతో బీజేపీతో కలిసి బీఆర్ఎస్ ఈ కుట్రకు పాల్పడింది" అని ఆయన విమర్శించారు. ప్రభుత్వం తరపున హైకోర్టులో బలమైన వాదనలు వినిపించినప్పటికీ, స్టే రావడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తదుపరి అనుసరించబోయే వ్యూహంపై మంత్రి శ్రీహరి స్పష్టతనిచ్చారు. హైకోర్టు జారీ చేసిన తీర్పు పూర్తి కాపీ చేతికి అందిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఉన్నతస్థాయిలో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. న్యాయనిపుణులతో సంప్రదింపులు జరిపిన అనంతరం, హైకోర్టు తీర్పును సుప్రీం కోర్టులో సవాలు చేయాలా లేదా ఇతర న్యాయపరమైన చర్యలు చేపట్టాలా అనే విషయంపై తుది నిర్ణయం తీసుకుంటామని వివరించారు. బీసీల సామాజిక న్యాయం కోసం ఎంతవరకైనా పోరాడతామని, ఈ రిజర్వేషన్ల అమలు తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. మరోవైపు, జీవో-9పై హైకోర్టు స్టే విధించడం రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంఘాల్లో ఆందోళనను రేకెత్తించింది. ఈ పరిణామం స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ఆలస్యం కావడానికి కారణమవుతుందేమోననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని సామాజిక న్యాయానికి సంబంధించిన అంశంగా భావిస్తుండగా, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు మాత్రం ప్రభుత్వ నిర్ణయాన్ని మొదటి నుంచి విమర్శిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం తీసుకోబోయే తదుపరి అడుగుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. బీసీ సంఘాలు మాత్రం ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తూ, రిజర్వేషన్ల అమలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతున్నాయి.

## వ్యాపారి కిడ్నాప్..

## 10 కోట్ల డిమాండ్

**భార్యకు చాకచక్యంగా లొకేషన్‌ను షేర్ చేసిన బాధితుడు**

**సమాచారం అందుకుని వల పన్నిన మధురానగర్ పోలీసులు**

**ముగ్గురు నిందితుల అరెస్ట్, మరో ఇద్దరి కోసం గాలింపు**

హైదరాబాద్, అక్టోబర్ 9 (ఈవార్తలు): హైదరాబాద్‌లో ఓ వ్యాపారి కిడ్నాప్ ఉదంతం తీవ్ర కలకలం రేపింది. రూ.10 కోట్ల ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో ఓ వ్యాపారిని అపహరించిన దుండగులు, తుపాకీతో బెదిరించి ఓ ఫ్లాట్‌లో నిర్బంధించారు. అయితే, ఆపద సమయంలో బాధితుడు చూపిన సమయస్ఫూర్తి అతడి ప్రాణాలను కాపాడింది. తాను ఉన్న ప్రదేశం లొకేషన్‌ను చాకచక్యంగా తన భార్యకు పంపడంతో, ఆమె వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు పక్కా ప్రణాళికతో కిడ్నాపర్లను పట్టుకుని వ్యాపారిని సురక్షితంగా విడిపించారు. పోలీసుల కథనం ప్రకారం బాచుపల్లికి చెందిన వ్యాపారి మనోజ్‌కుమార్ (44) ఈ నెల 6వ తేదీ సాయంత్రం వాకింగ్ చేస్తుండగా వెంకట్ స్వరూప్ అనే వ్యక్తి మరికొందరితో కలిసి అతడిని కలిశాడు. మాటలతో నమ్మించి చర్చల పేరుతో ఎల్లారెడ్డిగూడలోని ఓ అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌కు తీసుకెళ్లారు. అక్కడికి వెళ్లగానే అసలు స్వరూపం బయటపెట్టారు. ఫ్లాట్‌లో అప్పటికే ఉన్న మరికొందరు మనోజ్‌కుమార్‌పై దాడి చేసి, తుపాకులతో బెదిరించారు. తమకు ఇవ్వాల్సిన రూ.10 కోట్లు వెంటనే చెల్లించాలని, లేకపోతే ప్రాణాలు తీస్తామని హెచ్చరించారు. అనంతరం మనోజ్‌కుమార్‌తోనే అతడి భార్యకు ఫోన్ చేయించి, డబ్బు సిద్ధం చేసుకుని అమీర్‌పేట్ మైత్రీవనం వద్దకు తీసుకురావాలని చెప్పారు. ఈ క్రమంలోనే మనోజ్‌కుమార్ తెలివిగా వ్యవహరించి, తాను నిర్బంధంలో ఉన్న ఫ్లాట్ లొకేషన్‌ను రహస్యంగా తన భార్యకు వాట్సాప్‌లో షేర్ చేశాడు. అది చూసి ఆందోళనకు గురైన ఆమె తక్షణమే డయల్ 100 ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేసింది. సమాచారం అందుకున్న మధురానగర్ పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. కిడ్నాపర్లు చెప్పిన ప్రదేశంలో డబ్బు ఇస్తున్నట్లుగా నమ్మించి వల పన్నారు. డబ్బు తీసుకోవడానికి అక్కడికి వచ్చిన ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల రాకను గమనించిన మరో ఇద్దరు అక్కడి నుంచి పరారయ్యారు. కిడ్నాపర్ల చెర నుంచి మనోజ్‌కుమార్‌ను పోలీసులు సురక్షితంగా కాపాడారు. పాత ఆర్థిక లావాదేవీల కారణంగానే ఈ కిడ్నాప్‌కు పాల్పడినట్లు నిందితుల్లో ఒకరు విచారణలో అంగీకరించినట్లు తెలిసింది. బాధితుడి ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, తదుపరి దర్యాప్తు నిమిత్తం కేసును మియాపూర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

# బీసీలకు కాంగ్రెస్ దగా

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



హైదరాబాద్, అక్టోబర్ 9 (ఈవార్తలు): 'ఇన్నాళ్లపాటు అడ్డగోలు విధానాలతో 42 శాతం హామీ తుంగలో తొక్కారు, రేవంత్ రెడ్డి బీసీలను దారుణంగా మోసం చేశారు. న్యాయస్థానంలో నిలబడని జీఓతో మభ్యపెట్టారు. కేంద్రంలో బీజేపీ కూడా వెన్నుపోటు పొడిచింది' అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. అందుకే ఎన్నికల ముంగిట బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ మోసం కోర్టు ఆపిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తనపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకతను ఎదుర్కోలేక ఎన్నికల వాయిదా కోసం బీసీ రిజర్వేషన్ల అంశాన్ని వాడుకుందని పేర్కొన్నారు. బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం తప్పదని మాజీ మంత్రి కేటీఆర్ హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పుపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పందిస్తూ పత్రిక ప్రకటన విడుదల చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఇన్ని రోజులపాటు మోసపూరితంగా వ్యవహరించిన తీరుపై కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. హైకోర్టు స్టేతో 42 శాతం రిజర్వేషన్ల పేరిట రేవంత్ రెడ్డి ఇంతకాలం చేసిందంతా డ్రామా తప్ప మరొకటి కాదని రుజువైపోయిందని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన మోసపూరిత విధానాలు, చట్టం పరీక్షకు నిలవకుండా వ్యవహరించిన తీరుతోనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ దక్కకుండా పోయిందని రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. కామారెడ్డి డిక్లరేషన్‌ను కాలరాసి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని బీసీలను దారుణంగా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మభ్యపెట్టేందుకు తెచ్చిన జీఓ న్యాయస్థానాల్లో నిలబడదని బీఆర్ఎస్ చెప్పిన మాట అక్షరాలా నిజమని తేలిపోయిందని తెలిపారు. కులగణన నుంచి జీఓ దాకా రేవంత్ రెడ్డి చేసినదంతా మోసం, దగా, నయవంచన తప్ప మరొకటి కాదని మాజీ మంత్రి కేటీఆర్ ప్రకటించారు. ప్రతి సందర్భంలో రేవంత్ రెడ్డి చేస్తున్న మోసాన్ని అనుసరిస్తున్న తప్పుడు విధానాలను ఎప్పటికప్పుడు తాము అనేక సూచనలు చేశామని గుర్తు చేశారు. అసెంబ్లీలో ఆమోదించిన బిల్లుల ఆమోదం కోసం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాల్సింది పోయి, ఏకపక్షంగా ధర్నా పేరిట నాటకమాడారని కేటీఆర్ తెలిపారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించి 42 శాతం బీసీలకు పదవులు కట్టబెడతామని చెప్పి, పూటకొక మాటను కాంగ్రెస్ మార్చిందని మాజీ మంత్రి కేటీఆర్ గుర్తుచేశారు. రాహుల్ గాంధీని ప్రధాని చేసుకున్నాక రిజర్వేషన్లు సాధిస్తామని చెప్పిన అడ్డగోలు మాటల్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రపతి వద్ద బిల్లు పెండింగ్‌లో ఉండగానే ఆర్డినెన్స్ పేరిట కొంతకాలం హంగామా చేశారని, చివరికి న్యాయస్థానాల్లో నిలబడని జీఓతో మభ్యపెట్టారని మాజీ మంత్రి కేటీఆర్ వివరించారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి మోసం బయటపడిందని తెలిపారు. ఎన్నికలు వాయిదా వేసేందుకు బీసీ రిజర్వేషన్లను పావుగా వాడుకున్నారని ప్రకటించారు.

# రేవంత్ ప్లానేంటి?

**పార్టీ పరమైన రిజర్వేషన్లా?**

**న్యాయపోరాటం కొనసాగింపా?**

హైదరాబాద్, అక్టోబర్ 9 (ఈవార్తలు): బీసీ రిజర్వేషన్ జీవోపై హైకోర్టు స్టే విధించడంతో సీఎం రేవంత్ రెడ్డి ముందు స్థానిక ఎన్నికల విషయంలో రెండు మార్గాలు ఉన్నాయి. ఒకటి న్యాయపోరాటం కొనసాగించడం.. రెండు పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలను నిర్వహించేయడం. స్థానిక ఎన్నిక ఎన్నికలను రేవంత్ నిర్వహించాలనుకుంటున్నారా.. వద్దనుకుంటున్నారా అన్నదానిపైనే తదుపరి ప్రభుత్వ వ్యూహం ఆధారపడి ఉండనుంది. స్థానిక ఎన్నికలను నిర్వహించాలనుకుంటే గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన రిజర్వేషన్ల జీవో ఆధారంగానే.. షెడ్యూల్ మార్చి.. నోటిఫికేషన్ జారీ చేస్తారు. అలా చేస్తే రాజకీయపరమైన విమర్శలు, బీసీలను మోసం చేశారన్న ఆరోపణలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అయితే దీనికి పరిష్కారంగా న్యాయపరమైన వివాదాలు ఉన్నాయి కాబట్టి పార్టీ పరమైన రిజర్వేషన్లు ఇస్తున్నామని.. బీసీలపై చిత్తశుద్ధి ఉంటే ఇతర పార్టీలు అదే విధంగా రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేసే అవకాశం ఉంది. అలా చేయడం వల్ల ఎదురుదాడి చేయవచ్చు. ఒక వేళ స్థానిక ఎన్నికలు ఇప్పుడు అవసరం లేదని.. అదో తలనొప్పని రేవంత్ రెడ్డి అనుకుంటే న్యాయపోరాటానికి మొగ్గు చూపే అవకాశం ఉంది. ప్రస్తుతం హైకోర్టులో విచారణ జరగాలంటే.. నాలుగువారాలు పడుతుంది. అందుకే మంత్రి వాకిటి శ్రీహరి తాము సుప్రీంకోర్టుకు వెళ్తామని ప్రకటించారు. అలా వెళ్తే అక్కడ రిలీఫ్ వస్తుందని అనుకోవడానికి లేదు. ఎందుకంటే రిజర్వేషన్ల జీవోలో అన్ని సంక్లిష్టతలు ఉన్నాయి. న్యాయపోరాటం ఎంత కాలం సాగుతుందో చెప్పలేరు. అంత కాలం ఎన్నికలు నిర్వహించకుండా ఉండలేరు. స్థానిక ఎన్నికలు నిర్వహించకపోతే.. బ్యాక్ లాగ్‌లా ఎప్పటికీ అలా ఉండిపోతాయి. ఎందుకంటే లోకల్ పోల్స్ కోసం గ్రామస్థాయి క్యాడర్ ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. గత పన్నెండేళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీ క్యాడర్ కు రాజకీయ పరమైన పదవులు లేవు. గ్రామాల్లో, మండలాల్లో అధికారం లేదు. ఇప్పుడు ఆ అదికారాన్ని కోరుకుంటున్నారు. ఎలాగైనా ఎన్నికలు జరగాలని కోరుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రావాలన్నా.. ఎన్నికలు నిర్వహించక తప్పని పరిస్థితి. ఎన్నికలను వాయిదా వేసుకుంటూ పోతే.. భారంగా మారతాయి కానీ.. ప్లస్ అయ్యే అవకాశాలు ఉండవు. అందుకే సీఎం రేవంత్ రెడ్డి కూడా వీలైనంత త్వరగా స్థానిక ఎన్నికలు నిర్వహిస్తారని.. దానికి ప్లాన్ బీ అమలు చేస్తారని గట్టిగా నమ్ముతున్నారు.

# నల్లగొండలో ప్రేమోన్మాది దారుణం

**ప్రేమ పేరుతో విద్యార్థినిపై అత్యాచారం.. రక్తస్రావంతో మృతి**

నల్లగొండ, అక్టోబర్ 9 (ఈవార్తలు): ప్రేమ పేరుతో ఇంటర్ విద్యార్థినిని నమ్మించి, అత్యాచారానికి పాల్పడి ఆమె మృతికి కారణమైన దారుణ ఘటన నల్గొండలో వెలుగుచూసింది. ఈ కేసుకు సంబంధించి ప్రధాన నిందితుడితో పాటు అతడికి సహకరించిన స్నేహితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం నల్గొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని రోజూ ఆటోలో కాలేజీకి వెళ్లేది. అదే గ్రామంలో మూడు నెలల క్రితం ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసిన గడ్డం కృష్ణ అనే యువకుడు ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ ద్వారా నిత్యం చాటింగ్ చేస్తూ, ప్రేమ పేరుతో ఆమెను మభ్యపెట్టాడు. ఈ నెల 7వ తేదీన బాలిక రోజూలాగే ఆటోలో కాలేజీకి బయలుదేరింది. ఉదయం 8:30 గంటల సమయంలో డీఈవో ఆఫీసు చౌరస్తా వద్దకు ఆటో చేరుకోగానే పథకం ప్రకారం బైక్‌పై అక్కడ వేచి ఉన్న కృష్ణ ఆమెను ఆటో నుంచి దింపాడు. తన బైక్‌పై తీసుకెళ్తే గ్రామస్థులు ఎవరైనా గుర్తుపడతారనే ఉద్దేశంతో తన స్నేహితుడైన ఆటో డ్రైవర్ బచ్చలకూరి మధు వాహనంలో బాలికను ఎక్కించాడు. మధు ఆమెను షంషూనగర్‌లోని కృష్ణ అద్దెకు ఉంటున్న గది వద్దకు తీసుకెళ్లాడు. అనంతరం కృష్ణ ఆ గదికి చేరుకుని బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో తీవ్ర రక్తస్రావం కావడంతో విద్యార్థిని అపస్మారక స్థితిలోకి వెళ్లి, అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది.

## సోషల్ వాణి



చావు నిన్ను చంపిందేమో.. కానీ , నీ ఆత్మాభిమానాన్ని, ఆత్మగౌరవాన్ని మాత్రం ఏం పీకలేకపోయింది.

- బోరెడ్డి మహిపాల్ రెడ్డి

# అమెరికా సానుకూలంగా ఉండాలి

## అమెరికా ప్రతినిధుల బృందంతో సీఎం రేవంత్

హైదరాబాద్, అక్టోబర్ 9 (ఈవార్తలు): తెలంగాణకు వచ్చిన అమెరికా హడ్సన్ ఇన్స్టిట్యూట్‌కు చెందిన 16 మంది ప్రతినిధుల బృందంతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గురువారం సచివాలయంలో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఇండియా ఫౌండేషన్ సారథ్యంలో ప్రతినిధి బృందం భారత్‌లోని పలు రాష్ట్రాల్లో పర్యటిస్తోందని తెలిపారు. అమెరికా తీసుకుంటున్న నిర్ణయాలు, అనుసరించే విధానాలన్నీ సానుకూల దృక్పథంతో ఉండాలని ఆయన సూచించారు. అమెరికా, భారత్ మధ్య సంబంధాలను మరింత పెంపొందించేలా ఉండాలని సీఎం ఆకాంక్షించారు. ఇటీవల అమెరికా పెంచిన సుంకాలు, వీసాలపై కఠిన నిబంధనలన్నీ ఆందోళన కలిగించాయని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు దేశాల మధ్య ఆర్థిక వృద్ధికి దోహదపడే విధానాలు అనుసరిస్తే ప్రపంచానికి ఆదర్శవంతంగా ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు.





# గ్లోబల్ రాజధానిగా హైదరాబాద్

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 9 (ఈవార్తలు): హైదరాబాద్ నగరం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు రాజధానిగా మారింది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ప్రస్తుతం రెండవ స్థానంలో ఉన్న హైదరాబాద్ నగరం త్వరలోనే మొదటి స్థానానికి వస్తుందని ఆశిస్తున్నాను. హైదరాబాద్ నగరం బెంగళూరును దాటి మరింత ప్రగతి సాధించాలని కోరుకుంటున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు. హైదరాబాదులోని నోవాటెల్‌లో జరిగిన జీసీసీ సమావేశంలో కేటీఆర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈరోజు హైదరాబాద్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు రాజధానిగా మారడం వెనక గత ప్రభుత్వం కృషి ఎంతగానో ఉన్నది. పది సంవత్సరాలపాటు అన్ని రంగాల్లో, అన్ని కోణాల్లో హైదరాబాద్ నగరాన్ని సమగ్రంగా తీర్చిదిద్దడం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు వ్యక్తుల ఆధారంగా కాకుండా శాశ్వతంగా మంచి ఫలితాలు వచ్చేలా వ్యవస్థలను, చట్టాలను, సంస్కరణలను తీసుకురావడం వలన తెలంగాణ వ్యాపార, వాణిజ్య, పెట్టుబడి రంగాల్లో అగ్రస్థానంలో నిలిచింది అని కేటీఆర్ గుర్తు చేశారు. అందుకే బ్యాంకింగ్, ఫార్మా, హెల్త్ కేర్, ఐటీ ఇవన్నీ రంగాల్లో భారీగా పెట్టుబడులను, అంతర్జాతీయ కంపెనీలను ఆకర్షించగలిగింది. హైదరాబాద్‌లో అనేక అవకాశాలు ఉన్నాయి. వీటన్నింటినీ ఉపయోగించుకొని మరింత పెట్టుబడులు వచ్చేలా తమ తమ పరిధిలో కృషి చేయాలని చార్టెడ్ అకౌంటెంట్‌లకు పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఉన్న సంస్కరణల యుగంలో ఆర్థిక కార్యకలాపాల పైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువస్తున్న చట్టాల నేపథ్యంలో చార్టెడ్ అకౌంటెంట్ల ప్రాధాన్యత బాగా పెరిగిందని, వీరంతా దేశంలో డిజిటల్ ఫైనాన్షియల్ ఎకోసిస్టమ్‌కు సంబంధించిన రంగంలో కీలకంగా మారారని కేటీఆర్ తెలిపారు. ప్రభుత్వంలో ఉన్నా లేకపోయినా తెలంగాణ రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు రావాలని ఎల్లప్పుడూ కోరుకుంటామని తెలిపిన కేటీఆర్, ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

# పీపీపీపై జోక్యం చేసుకోం

### ఏపీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు

అమరావతి, అక్టోబర్ 9 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో వైద్య కళాశాలల నిర్మాణానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ నిర్ణయంలో న్యాయస్థానం జోక్యం చేసుకోలేదని స్పష్టం చేస్తూ, "ప్రభుత్వం ప్రైవేటు భాగస్వామ్యంతో వైద్య కళాశాలలు నిర్మిస్తే తప్పేమిటి?" అని ధర్మాసనం ప్రశ్నించింది. ప్రభుత్వం పిలిచిన టెండర్లపై స్టే ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది. "పూర్తిగా ప్రైవేటుకు అప్పగించడం కాకుండా ప్రభుత్వ భాగస్వామ్యం ఉండడం మంచిదే. పీపీపీ విధానంలో ఆసుపత్రుల నిర్మాణం ప్రభుత్వ విధానపరమైన నిర్ణయం. రాజ్యాంగం లేదా చట్టాన్ని ఉల్లంఘించే నిర్ణయాల్లో తప్ప న్యాయస్థానం జోక్యం చేసుకోదు" అని పేర్కొంది. "నిధుల కొరత కారణంగా ప్రభుత్వం పీపీపీ విధానాన్ని ఎంచుకొని ఉండవచ్చు. అది తప్పెలా అవుతుంది? నిధులున్నప్పుడే కట్టాలంటే ఎన్నేళ్లు పడుతుంది. జిల్లాల్లో కోర్టు భవనాలు కూడా నిధుల లేమితో నిలిచిపోయాయి.

# నవంబర్‌లో ఏపీ టెట్

## జనవరిలో డీఎస్సీ నోటిఫికేషన్.. నిరుద్యోగులకు ఏపీ సర్కారు శుభవార్త

అమరావతి, అక్టోబర్ 9 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది నిరుద్యోగులకు ప్రభుత్వం తీపికబురు అందించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా ప్రతీ ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని స్పష్టం చేసింది. ఇందులో భాగంగా, ఈ ఏడాది నవంబర్ చివరి వారంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహించి, 2026 జనవరిలో డీఎస్సీ, స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. మార్చిలో పరీక్షలు పూర్తి చేసి, వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరేలా పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని ఆయన సూచించారు. పాఠశాల, ఇంటర్మీడియట్, కళాశాల విద్యపై ఉన్నతాధికారులతో మంత్రి లోకేశ్ సచివాలయంలో గురువారం విస్తృతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డీఎస్సీ, టెట్ పరీక్షలకు అభ్యర్థులు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. తమ దృష్టికి వచ్చిన 423 వినతుల్లో ఇప్పటికే 200 పరిష్కరించామని, మిగిలినవి విధానపరమైన, ఆర్థికపరమైన అంశాలతో ముడిపడి ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. రాష్ట్రంలో విద్యా




ప్రమాణాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని మంత్రి లోకేశ్ తెలిపారు. విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు పటిష్ఠమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఇందుకోసం బేస్‌లైన్ టెస్టుల నిర్వహణకు విధివిధానాలు సిద్ధం చేయాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు డిసెంబర్ నాటికే సిలబస్ పూర్తి చేసి, ఆ తర్వాత 100 రోజుల ప్రత్యేక ప్రణాళిక ద్వారా మెరుగైన ఫలితాలు సాధించాలని లక్ష్యంగా నిర్దేశించారు. విద్యా వ్యవస్థలో వినూత్న పద్ధతులను అధ్యయనం చేసేందుకు, రాష్ట్రంలోని 78 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సింగపూర్ పర్యటనకు పంపాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. దీనికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, రాష్ట్రానికి కొత్తగా మంజూరైన 11 జవహర్ నవోదయ విద్యాలయాల పనులను వేగవంతం చేయాలని కోరారు. విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పనపై కూడా సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అమరావతిలో రూ.100 కోట్ల భారీ వ్యయంతో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణానికి ఉత్తమమైన డిజైన్‌ను ఎంపిక చేసేందుకు 'హ్యాకథాన్' నిర్వహించాలని మంత్రి లోకేశ్ సూచించారు. జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లోని గ్రంథాలయాలను ఆధునికీకరించాలని, స్థానిక సంస్థల నుంచి రావాల్సిన లైబ్రరీ సెస్సును వసూలు చేయాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను పెంచేందుకు కడపలో విజయవంతమైన 'స్మార్ట్ కిచెన్' నమూనాను రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. హైస్కూళ్లలో కంప్యూటర్ ల్యాబ్‌లు, ఇతర మౌలిక వసతులు కల్పించాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజు, కళాశాల విద్యా డైరెక్టర్ నారాయణ భరత్ గుప్తా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### విశాఖ ఉక్కు కార్మికులతో భేటీలో మాజీ సీఎం జగన్

# అధికారం లేకున్నా స్టీల్ ప్లాంట్ కోసం పోరాడతాం

వైజాగ్, అక్టోబర్ 9 (ఈవార్తలు): విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ విషయంలో తమ పార్టీ వైఖరిలో ఎలాంటి మార్పు ఉండబోదని, అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా కార్మికుల పక్షానే నిలబడతామని వైసీపీ అధినేత జగన్ స్పష్టం చేశారు. కర్మాగారం ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకోవడమే తమ ఏకైక లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. గురువారం నర్సీపట్నం, విశాఖపట్నం పర్యటనలో భాగంగా తనను కలిసిన ఉక్కు పరిశ్రమ ఉద్యోగులకు జగన్ ఈ మేరకు హామీ ఇచ్చారు. పర్యటన సందర్భంగా స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు జగన్‌ను కలిసి, తమ ఆందోళనలను వివరిస్తూ ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. ఎన్నికలకు ముందు ఉక్కు కర్మాగారాన్ని కాపాడతామని వాగ్దానం చేసిన తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి, అధికారంలోకి వచ్చిన తర్వాత తమను పూర్తిగా విస్మరించిందని, ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదని కార్మికులు ఆయన వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు వైసీపీ వర్గాలు వెల్లడించాయి. కర్మాగారం మనుగడ



కోసం తాము చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని వారు జగన్‌ను అభ్యర్థించారు. కార్మికుల విజ్ఞప్తిపై జగన్ సానుకూలంగా స్పందించారు. "అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా, స్టీల్ ప్లాంట్‌ను కాపాడాలనే మా వైఖరిలో మార్పు లేదు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకోవడమే మనందరి ఉమ్మడి లక్ష్యం. మీ పోరాటంలో వైసీపీ ఎల్లప్పుడూ మీకు అండగా నిలుస్తుంది" అని ఆయన కార్మికులకు భరోసా ఇచ్చారు. ఈ పోరాటంలో తాను వ్యక్తిగతంగా కూడా అండగా ఉంటానని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు ప్రభుత్వం ముందు మూడు కీలక డిమాండ్లను ఉంచారు. కేంద్ర ప్రభుత్వంపై రాజకీయంగా ఒత్తిడి తీసుకొచ్చి, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకునేలా చేయాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్రత్యేకంగా క్యాప్టివ్ గనులను కేటాయించాలని, తద్వారా ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాలని కోరారు. కర్మాగారాన్ని స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ లో విలీనం చేసి ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని వారు విజ్ఞప్తి చేశారు. గతంలో ఉద్యోగాల నుంచి తొలగించిన కార్మికులందరినీ బేషరతుగా తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కూడా వారు తమ డిమాండ్లలో పేర్కొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు తమ ఆందోళనను మరింత ఉద్ధృతం చేస్తామని కార్మిక సంఘాల నాయకులు ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# జగన్ హద్దు మీరితే అనుమతి రద్దు

నర్సీపట్నం/అమరావతి, అక్టోబర్ 9 (ఈవార్తలు): వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నర్సీపట్నం పర్యటనకు సంబంధించి పోలీసులు అత్యంత కఠినమైన ఆంక్షలు విధించారు. నిర్దేశించిన షరతులను అతిక్రమిస్తే, పర్యటనకు ఇచ్చిన అనుమతిని తక్షణమే రద్దు చేస్తామని, రాజకీయ హోదాతో సంబంధం లేకుండా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా హెచ్చరించారు. ఈ విషయంలో పోలీసులు జీరో టాలరెన్స్ విధానాన్ని అనుసరిస్తారని ఆయన స్పష్టం చేశారు. పోలీసు చట్టంలోని సెక్షన్ 30, 30ఏ ప్రకారం నిర్దిష్ట మార్గం, సమయం, పరిమితులకు లోబడే జగన్ పర్యటనకు అనుమతి ఇచ్చామని డీజీపీ తెలిపారు. పర్యటన మార్గంలో కాన్వాయ్‌కు ముందు లేదా వెనుక ఊరేగింపులు, ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించడంపై నిషేధం విధించినట్లు పేర్కొన్నారు. అనుమతించిన ప్రాంతాలు మినహా ఇతర చోట్ల రాజకీయ నినాదాలు చేయడం, స్వాగత సభలు ఏర్పాటు చేయడం కుదరదని తేల్చిచెప్పారు. ప్రజలను, కార్యకర్తలను సమీకరించినా లేదా ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించినా చట్టపరమైన ఉల్లంఘనగా పరిగణిస్తామని వెల్లడించారు. అంతకుముందు, జగన్ గురువారం నాటి పర్యటనకు సంబంధించి విశాఖ, అనకాపల్లి పోలీసులు 18 నిబంధనలతో కూడిన అనుమతులు మంజూరు చేశారు. ఆయన కాన్వాయ్‌లో కేవలం 10 వాహనాలకు మాత్రమే చోటు కల్పించారు. పోలీసులు సూచించిన రూట్ మ్యాప్‌లోనే ప్రయాణించాలని,



వేరే మార్గాల్లో వెళ్లకూడదని విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా స్పష్టం చేశారు. పర్యటన సందర్భంగా ఏదైనా ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం జరిగితే నిర్వాహకులే పూర్తి బాధ్యత వహించాలని, దీనిపై రాతపూర్వక హామీ ఇవ్వాలని ఆదేశించారు. విశాఖపట్నం ఎయిర్‌పోర్టు నుంచి మాకవరపాలెం వరకు సుమారు 63 కిలోమీటర్ల రోడ్డు మార్గంలో జగన్ పర్యటనకు వైసీపీ నేతలు అనుమతి కోరారు. అయితే, జాతీయ రహదారిపై భారీగా జన సమీకరణ చేసి ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తమకు సమాచారం ఉందని, దీనివల్ల ప్రజలకు తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు తప్పవని అనకాపల్లి ఎస్పీ తెలిపారు. ఇటీవల తమిళనాడులోని కరూర్ తొక్కిసలాటను గుర్తుచేస్తూ, అలాంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకే ఈ జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, జగన్ హెలికాప్టర్‌లో మాకవరపాలెం చేరుకోవాలని, అందుకు అవసరమైన అనుమతులు ఇస్తామని పోలీసులు సూచించారు.

# ఏపీ గ్రామీణ బ్యాంకుల విలీనం

### ఐదు రోజుల పాటు నిలిచిపోనున్న సేవలు

విజయవాడ, అక్టోబర్ 9 (ఈవార్తలు): ఏపీలోని నాలుగు గ్రామీణ బ్యాంకుల ఖాతాదారులకు ఇది ముఖ్యమైన వార్త. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు రాష్ట్రంలోని గ్రామీణ బ్యాంకుల విలీన ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో దాదాపు ఐదు రోజుల పాటు కీలక బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండవని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ప్రకటించింది. సాంకేతిక అనుసంధాన పనుల కారణంగా ఈ అంతరాయం ఏర్పడనుందని స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే... ఏపీలో కార్యకలాపాలు సాగిస్తున్న ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులను కలిపి 'ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు'గా ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నాలుగు బ్యాంకుల డేటాను ఒకే ప్లాట్‌ఫామ్‌పైకి తీసుకొచ్చే ప్రక్రియలో భాగంగా ఈ నెల 9వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి 13వ తేదీ ఉదయం 10 గంటల వరకు అన్ని రకాల బ్యాంకింగ్ కార్యకలాపాలు నిలిచిపోనున్నాయి. ఈ ఐదు రోజుల వ్యవధిలో బ్యాంక్ బ్రాంచ్‌లతో పాటు ఏటీఎం, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, యూపీఐ, ఐఎంపీఎస్ వంటి ఆన్‌లైన్ సేవలు కూడా పనిచేయవని బ్యాంకు యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కాలంలో అక్టోబర్ 11 (రెండో శనివారం), 12 (ఆదివారం) బ్యాంకులకు సెలవులు అయినప్పటికీ, సాధారణంగా పనిచేసే ఆన్‌లైన్ సేవలు కూడా అందుబాటులో ఉండవని పేర్కొంది. ఈ ప్రక్రియ వల్ల ఖాతాదారులకు కలిగే అసౌకర్యానికి చింతిస్తున్నామని బ్యాంకు యాజమాన్యం పేర్కొంది.

# ఐకేపీ సెంటర్ ఏర్పాటు చేయాలి

### అధికారులకు రైతుల విజ్ఞప్తి

పెగడపల్లి, అక్టోబర్ 9 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం ఏడుమోటలపల్లి తండాలో ఐకేపీ సెంటర్ ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. తండాలో 50-70 ఎకరాల విస్తీర్ణంలో వ్యవసాయ పంటలు పండిస్తున్నామని, ఆ పంటల కొనుగోలుకు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విన్నవిస్తున్నారు. గ్రామంలో 8-10 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉందని.. ఆ స్థలంలో కేంద్రాన్ని ఏర్పాటు చేసే రైతులకు ఆసరాగా ఉంటుందని వెల్లడించారు. స్థానికంగా ఐకేపీ సెంటర్ లేకపోవడం వల్ల పెగడపల్లి మార్కెట్‌కు తీసుకెళ్లేందుకు ట్రాక్టర్ చార్జీ రూ.2 వేలు అవుతోందని, దాంతో రైతులు నష్టం చవిచూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వీలైనంత త్వరగా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# పేకాట స్థావరంపై దాడి.. ఆరుగురి అరెస్ట్

పెగడపల్లి, అక్టోబర్ 9 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం బతికేపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతూ ఆరుగురు పట్టుబడ్డారు. వారివద్ద రూ.8,850 నగదు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు.

# హత్య కేసులో ఇద్దరికి యావజ్జీవం

### రూ.15 వేల చొప్పున జరిమానా



జగిత్యాల టౌన్, అక్టోబర్ 9 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా బుగ్గారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మద్దునూరు గ్రామ శివారులో ఓ వ్యక్తి హత్య కేసులో ఇద్దరు నిందితులకు యావజ్జీవ శిక్ష పడింది. ఈ మేరకు జగిత్యాల జిల్లా ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి నారాయణ తీర్పు వెలువరించారు. వారిద్దరికి రూ.15 వేల చొప్పున జరిమానా కూడా విధిస్తున్నట్లు వెల్లడించారు. వివరాల్లోకెళితే.. మంచిర్యాల జిల్లా దండపల్లి మండలం గూడెం గ్రామానికి చెందిన సూర దుర్గయ్య (60) అదే గ్రామంలో బండ కొట్టే పనిచేస్తూ జీవనం కొనసాగించేవాడు. అదే గ్రామానికి చెందిన దారంగుల రాజేశం(39), దారంగుల రాజు(33) సోదరులతో దుర్గయ్యకు పాత గొడవలు ఉండేవి. అయితే, 2021 ఫిబ్రవరి 19న ఇంటి నుంచి వెళ్లిన దుర్గయ్య తిరిగి రాలేదు. అయితే, జగిత్యాల జిల్లా బుగ్గారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మద్దునూరు గ్రామ శివారులో గుట్టల ప్రాంతంలో దుర్గయ్య శవమై కనిపించాడు. కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. రాజేశం, రాజును నిందితులు అని తేల్చి కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో జడ్జి తీర్పు వెలువరించారు. ఈ కేసుపై జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. నేరం చేసినవారెవరూ తప్పించుకోలేరని స్పష్టం చేశారు. కేసును చాకచక్యంగా ఛేదించిన సిబ్బందిని ఆయన అభినందించారు.

# ఏపీలో 31 మంది ఐఏఎస్‌ల బదిలీ

అమరావతి, అక్టోబర్ 9 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాలనలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖల్లో పనిచేస్తున్న 31 మంది అఖిల భారత సర్వీసు (ఏఐఎస్) అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీలతో పలు కీలక శాఖలకు కొత్త అధిపతులు రానున్నారు. ఈ బదిలీల్లో భాగంగా పలువురు సీనియర్ అధికారులకు ముఖ్యమైన బాధ్యతలు అప్పగించారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్‌గా మనజీర్ జిలానీ సామున్‌ను నియమించగా, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ బాధ్యతలను చక్రధర్ బాబుకు అప్పగించారు. అదేవిధంగా, ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) కార్యదర్శిగా రవి సుభాష్, పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా శివశంకర్ లోతేటి బాధ్యతలు చేపట్టనున్నారు. పౌరసరఫరాల శాఖ వైస్ ఛైర్మన్‌గా ఎస్. ఢిల్లీరావు, ఇంటర్మీడియట్ విద్యాశాఖ డైరెక్టర్‌గా పి. రంజిత్ బాషా, హౌసింగ్ కార్పొరేషన్ వైస్ ఛైర్మన్‌గా అరుణ్ బాబు నియమితులయ్యారు.

1. కొల్లాబత్తుల కార్తీక్ – నంద్యాల జాయింట్ కలెక్టర్
2. శ్రీధర్ బాబు – కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్
3. శుభమ్ బన్సల్ – పరిశ్రమల శాఖ డైరెక్టర్
4. మనజీర్ జిలానీ – వ్యవసాయ శాఖ డైరెక్టర్
5. అభిషేక్ గౌడ – ఏలూరు జాయింట్ కలెక్టర్
6. రవిసుభాష్ – ఏపీపీఎస్సీ కార్యదర్శి
7. నూరుల్ – కర్నూలు జాయింట్ కలెక్టర్
8. శివశంకర్ లోతేటి – ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ
9. ఢిల్లీ రావు – పౌరసరఫరాల శాఖ వైస్ ఛైర్మన్
10. రాహుల్ మీనా – రాజమండ్రి మున్సిపల్ కమిషనర్
11. పి. రంజిత్ బాషా – ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్
12. అపూర్వ భరత్ – కాకినాడ జాయింట్ కలెక్టర్
13. మౌర్య భరద్వాజ్ – శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్
14. అరుణ్ బాబు – హౌసింగ్ కార్పొరేషన్ వైస్ సీఎండీ
15. జేవీ మురళి – సీసీఎల్ఏ కార్యదర్శి
16. వెంకట్ త్రివినాగ్ – గృహనిర్మాణ శాఖ డిప్యూటీ కార్యదర్శి
17. టీఎస్ చేతన్ – సీసీఏఎల్ సంయుక్త కార్యదర్శి
18. కొమ్మిశెట్టి మురళీధర్ – ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్
19. ప్రసన్న వెంకటేశ్ – లెదర్ ఇండస్ట్రీస్ అభివృద్ధి కార్పొరేషన్
20. బి. నవ్య – రాష్ట్ర గిడ్డంగుల సంస్థ వైస్ ఛైర్మన్
21. ఎస్. భరణి – స్టేప్ కమిషనర్
22. ప్రవీణ్ ఆదిత్య – ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ
23. తిరుమణి శ్రీపూజ – అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్
24. కేఎల్ విశ్వనాథన్ – ఐ అండ్ పీఆర్ డైరెక్టర్
25. గోవిందరావు – పౌరసరఫరాల శాఖ
26. ఎస్. చిన్నరాముడు – ఎస్సీ కమిషన్ కార్యదర్శి
27. జి. సూర్యసాయి ప్రవీణ్ చంద్ – ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ
28. ఎస్ఎస్ భావన – బాపట్ల జాయింట్ కలెక్టర్
29. సి. విష్ణుచరణ్ – సోషల్ వెల్ఫేర్ శాఖ డిప్యూటీ కార్యదర్శి
30. ఎస్ఎస్ శోభిక – వైద్యఆరోగ్య శాఖ డిప్యూటీ కార్యదర్శి
31. అభిషేక్ కుమార్ – ఏపీ మారిటైం బోర్డు సీఈవో

# జైషే మహ్మద్ టీంలోకి మహిళలు!

**చదువుకున్న ముస్లిం మహిళలే టార్గెట్**

**భారత దాడుల తర్వాత ఉగ్ర స్థావరాల మార్పు**

ఇస్లామాబాద్/న్యూఢిల్లీ: పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థ తన కార్యకలాపాలను విస్తరించేందుకు సరికొత్త, ప్రమాదకరమైన కుట్రకు తెరలేపింది. ఇప్పటివరకు యువకులనే లక్ష్యంగా చేసుకున్న ఈ సంస్థ.. తాజాగా విద్యావంతులైన ముస్లిం మహిళలను ఉగ్రవాదం వైపు ఆకర్షించేందుకు ప్రయత్నిస్తోందని భారత నిఘా వర్గాలు సంచలన విషయాలు వెల్లడించాయి. మతపరమైన ప్రసంగాలు, భావోద్వేగపూరిత సందేశాలతో వారిని బ్రెయిన్‌వాష్ చేసి తమ నెట్‌వర్క్‌లో చేర్చుకోవడానికి పక్కా ప్రణాళికతో ముందుకెళుతున్నట్లు గుర్తించాయి. జైషే మహమ్మద్‌కు అనుబంధంగా పనిచేసే 'జమాతుల్–ముమినాత్' అనే సంస్థ ఈ నియామకాల్లో కీలక పాత్ర పోషిస్తున్నట్లు నిఘా వర్గాలు తెలిపాయి. ఈ సంస్థ 2004 నుంచే చురుకుగా ఉన్నప్పటికీ, ఇటీవల తన కార్యకలాపాలను ముమ్మరం చేసింది. ముఖ్యంగా జమ్మూ కశ్మీర్, ఉత్తరప్రదేశ్, దక్షిణ భారతదేశంలోని పట్టణ ప్రాంతాల్లో నివసించే చదువుకున్న మహిళలను లక్ష్యంగా చేసుకుంది. వాట్సాప్, టెలిగ్రామ్ వంటి




సోషల్ మీడియా వేదికలతో పాటు మదర్సాల నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుని చిన్న చిన్న గ్రూపులుగా ఏర్పడి ప్రచారం నిర్వహిస్తోంది. ఉర్దూ భాషలో ముద్రించిన ప్రచార సామగ్రిలో మక్కా, మదీనా చిత్రాలు, ఖురాన్‌లోని శ్లోకాలను వాడుతూ మహిళలను ఆకర్షిస్తున్నారు. "ఈ వ్యవస్థ అల్లాహ్ ఇచ్చింది", "ఈ వెలుగు ప్రపంచమంతా వ్యాపిస్తుంది" వంటి భావోద్వేగ నినాదాలతో వారిని ప్రలోభాలకు గురిచేస్తున్నారని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. హిజాబ్ ధరించడం, ప్రార్థనలు చేయడం ద్వారానే మతానికి సేవ చేసినట్లు అవుతుందని నమ్మించి, వారిని ఉగ్ర కార్యకలాపాల వైపు మళ్లిస్తున్నట్లు తేలింది. గతంలో భారత సైన్యం నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాక్ ఆక్రమిత కశ్మీర్, పంజాబ్ ప్రావిన్సులలో జైషే మహమ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్‌లకు చెందిన తొమ్మిది ప్రధాన ఉగ్రవాద శిబిరాలను మన బలగాలు ధ్వంసం చేశాయి. ఈ దాడుల తర్వాత ఉగ్ర సంస్థలు తమ వ్యూహాన్ని మార్చుకున్నాయి. భవిష్యత్తులో భారత్ నుంచి ఇలాంటి దాడులను ఊహించి, తమ స్థావరాలను పాకిస్థాన్–ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దుల్లోని కఠినమైన, దుర్భేద్యమైన ప్రాంతాలకు రహస్యంగా తరలిస్తున్నాయని నిఘా వర్గాలు గుర్తించాయి. అయితే, ఉగ్రవాదులు ఎంత దూరం వెళ్లినా తమ ప్రతీకార చర్యల నుంచి తప్పించుకోలేరని భారత సైనిక వర్గాలు స్పష్టం చేశాయి. గత వారం భారత ఆర్మీ చీఫ్ మాట్లాడుతూ.. పాకిస్థాన్ ప్రభుత్వం ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వడం ఆపకపోతే, ఆ దేశం ప్రపంచ పటం నుంచే కనుమరుగయ్యే ప్రమాదం ఉందని తీవ్రస్థాయిలో హెచ్చరించిన విషయం తెలిసిందే.

## 22కి చేరిన 'దగ్గు మందు' మరణాలు

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని ఛింద్వాడా జిల్లాలో కల్తీ దగ్గు మందు సృష్టిస్తున్న విషాదం అంతకంతకూ పెరుగుతోంది. తాజాగా మరో చిన్నారి చనిపోయాడు. దీంతో మృతుల సంఖ్య 22కు చేరింది. ఖాజ్రీ అంటు గ్రామానికి చెందిన అయిదేళ్ల మయాంక్ సూర్యవంశీ, నాగ్‌పూర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి ప్రాణాలు కోల్పోయాడు. కిడ్నీలు పూర్తిగా విఫలం కావడమే మృతికి కారణమని వైద్యులు తెలిపారు. తమిళనాడుకు చెందిన శ్రీశన్ ఫార్మాస్యూటికల్స్ తయారు చేసిన 'కోల్డ్రిఫ్' అనే దగ్గు మందు తాగడం వల్లే మయాంక్ మరణించినట్లు అధికారులు ధ్రువీకరించారు. ఈ సిరప్‌లో ప్రమాదకరమైన పారిశ్రామిక రసాయనం డైథిలిన్ గ్లైకాల్ (డీఈజీ) ఉన్నట్లు తేలింది. ఇది కిడ్నీలను తీవ్రంగా దెబ్బతీసి, ప్రాణాలను హరిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ దారుణ ఘటనపై మధ్యప్రదేశ్ పోలీసులు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. శ్రీశన్ ఫార్మా కంపెనీ యజమాని రంగనాథన్ గోవిందరాజన్‌ను చెన్నైలో అరెస్ట్ చేశారు. కాంచీపురంలోని మందుల తయారీ యూనిట్‌ను సీజ్ చేశారు. నిందితుడిని ఛింద్వాడాకు తరలించి విచారించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

# భారత్-యూకే జబర్'దోస్తీ'

**ఢిల్లీలో బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో ప్రధాని మోదీ భేటీ**

**భారత్‌లో 9 యూకే యూనివర్సిటీల ఏర్పాటుకు అంగీకారం**

**యూకే రాయల్ ఎయిర్‌ఫోర్స్‌కు శిక్షణ ఇవ్వనున్న భారత పైలట్లు**



న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి పరిస్థితుల్లో భారత్, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) మధ్య భాగస్వామ్యం ప్రపంచ స్థిరత్వానికి, ఆర్థిక ప్రగతికి ఒక ముఖ్యమైన స్తంభంలా నిలుస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. యూకే ప్రధాని కీర్ స్టార్మర్‌తో గురువారం రాజ్‌భవన్‌లో జరిగిన భేటీ అనంతరం ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఇరు దేశాల మధ్య రక్షణ, విద్య, వాణిజ్యం వంటి కీలక రంగాల్లో సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రక్షణ రంగంలో ఇరు దేశాలు ఒక చరిత్రాత్మక ఒప్పందానికి వచ్చాయి. ఈ ఒప్పందం ప్రకారం, భారత వాయుసేనకు చెందిన ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్లు యూకేలోని రాయల్ ఎయిర్‌ఫోర్స్‌లో శిక్షకులుగా పనిచేయనున్నారు. ఇది ఇరు దేశాల సైనిక సహకారంలో ఒక కొత్త అధ్యాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. అదేవిధంగా, విద్యారంగంలోనూ భారీ ముందడుగు పడింది. యూకేకు చెందిన తొమ్మిది ప్రముఖ విశ్వవిద్యాలయాలు తమ క్యాంపస్‌లను భారత్‌లో ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చాయి. ఇటీవలే సౌతాంప్టన్ యూనివర్సిటీ గురుగ్రామ్‌లో తన క్యాంపస్‌ను ప్రారంభించిందని, తొలి బ్యాచ్ విద్యార్థులు ప్రవేశాలు కూడా పొందారని ప్రధాని మోదీ సంతోషం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ అంశాలపై కూడా ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. ఉక్రెయిన్, గాజాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలపై చర్చలు, దౌత్య మార్గాల ద్వారా శాంతిని పునరుద్ధరించే ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతు ఇస్తుందని మోదీ పునరుద్ఘాటించారు. ఇండో–పసిఫిక్, పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం, సముద్ర భద్రతలో సహకారాన్ని పెంచుకోవాలని ఇరు దేశాలు కట్టుబడి ఉన్నాయని తెలిపారు. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, చట్టబద్ధమైన పాలన వంటి ఉమ్మడి విలువలపై ఇరు దేశాల సంబంధాలు ఆధారపడి ఉన్నాయని మోదీ అన్నారు. యూకేలో స్థిరపడిన 18 లక్షల మంది ప్రవాస భారతీయులు ఇరు దేశాల మధ్య సజీవ వారధిగా నిలుస్తున్నారని, వారి సహకారంతోనే మన స్నేహం మరింత బలపడిందని కొనియాడారు. సాంకేతికత, ప్రతిభ ఆధారంగా మన భాగస్వామ్యం విశ్వసనీయంగా ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. కొద్ది నెలల క్రితం కుదిరిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సెటా) తర్వాత యూకే ప్రధాని భారీ వ్యాపార ప్రతినిధి బృందంతో భారత్‌కు రావడం.. ఇరు దేశాల మధ్య ఏర్పడిన కొత్త ఉత్తేజానికి నిదర్శనమని ప్రధాని మోదీ అభివర్ణించారు.



## సభ పెడితే బాంబు పెడతాం

**నటుడు విజయ్‌కి బాంబు బెదిరింపులు**

చెన్నై: ప్రముఖ తమిళ నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ అధినేత విజయ్ ఇంటికి బాంబు బెదిరింపు రావడం చెన్నైలో తీవ్ర కలకలం సృష్టించింది. భవిష్యత్తులో బహిరంగ సభలు నిర్వహిస్తే ఆయన ఇంటికి బాంబు పెడతామని ఓ ఆగంతుకుడు పోలీసు కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి హెచ్చరించాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు నీలాంగరైలోని విజయ్ నివాసం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. పోలీసుల కథనం ప్రకారం కన్యాకుమారి నుంచి ఓ వ్యక్తి అత్యవసర నంబర్ 100కు ఫోన్ చేసి ఈ బెదిరింపులకు పాల్పడ్డాడు. ఇటీవలే కరూర్‌లో విజయ్ నిర్వహించిన సభలో తొక్కిసలాట జరిగి 41 మంది మరణించిన విషాద ఘటన నేపథ్యంలో ఈ బెదిరింపు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం పోలీసులు ఫోన్ కాల్ ఆధారంగా నిందితుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మరోవైపు కరూర్ ఘటన తర్వాత విజయ్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. మృతుల కుటుంబసభ్యులకు వ్యక్తిగతంగా వీడియో కాల్స్ చేస్తూ పరామర్శిస్తున్నారు. "నేను మీకు అండగా ఉన్నాను" అని వారికి భరోసా ఇస్తూ, త్వరలోనే నేరుగా కలుస్తానని హామీ ఇచ్చారు. మృతుల కుటుంబాలకు తన వంతుగా ఆర్థిక సహాయం అందిస్తానని కూడా ఆయన ప్రకటించారు. అయితే, ఈ ఘటనపై విజయ్ న్యాయపరమైన చిక్కులను కూడా ఎదుర్కొంటున్నారు. తొక్కిసలాట జరిగిన తర్వాత విజయ్ ఘటనా స్థలం నుంచి వెళ్లిపోయారని మద్రాస్ హైకోర్టు విమర్శించింది. ఈ ఘటనపై కోర్టు ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) పక్షపాతంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ విజయ్ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

## తూచ్.. నేనలా అనలేదు

**నా మాటలను వక్రీకరించారు**

**కేంద్ర మాజీ మంత్రి చిదంబరం**



ముంబై: 2008 నాటి ముంబై ఉగ్రదాడుల (26/11) అనంతరం నాటి యూపీఏ ప్రభుత్వం స్పందించిన తీరుపై ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారాన్ని రేపాయి. ప్రధాని ఆరోపణలను కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ హోంమంత్రి పి. చిదంబరం తీవ్రంగా ఖండించారు. ప్రధాని మోదీ తన వ్యాఖ్యలను పూర్తిగా వక్రీకరించారని, ఆయన చెప్పిన మాటల్లో ఏమాత్రం వాస్తవం లేదని స్పష్టం చేశారు. బుధవారం ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, 26/11 దాడుల తర్వాత ప్రతీకారం తీర్చుకోవడానికి భారత సైన్యం సిద్ధంగా ఉన్నప్పటికీ, ఓ విదేశీ శక్తి ఒత్తిడి కారణంగా నాటి కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గిందని ఆరోపించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్‌కు చెందిన ఓ సీనియర్ నేతే ఇటీవలి ఇంటర్వ్యూలో వెల్లడించారని, పేరు చెప్పకుండా చిదంబరాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ప్రధాని ఆరోపణలపై గురువారం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా చిదంబరం స్పందించారు. "ప్రధాని మోదీ చెప్పిన మాటలు పూర్తిగా తప్పు. ఆయన ఆ మాటలను ఊహించుకుని, వాటిని నాకు ఆపాదించడం నిరాశ కలిగించింది" అని పేర్కొన్నారు. ప్రధాని ప్రస్తావించినట్టుగా సైన్యాన్ని ఆపాలని ఏ విదేశీ శక్తి ఒత్తిడి చేయలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ నెల ప్రారంభంలో చిదంబరం ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ, 26/11 దాడుల తర్వాత ప్రతీకార చర్యల గురించి తాము ఆలోచించామని తెలిపారు. "పరిస్థితిని దౌత్య మార్గాల్లో పరిష్కరించుకోవాలని, యుద్ధానికి దిగవద్దని ప్రపంచ దేశాల నుంచి, ముఖ్యంగా అమెరికా నుంచి ఒత్తిడి వచ్చింది. అప్పటి అమెరికా విదేశాంగ మంత్రి కండోలీజా రైస్ స్వయంగా ఢిల్లీకి వచ్చి ప్రధాని మన్మోహన్ సింగ్‌ను, నన్ను కలిసి సైనిక చర్యకు దిగవద్దని కోరారు" అని వివరించారు. అయితే, తాము ఒత్తిడికి తలొగ్గి సైన్యాన్ని ఆపినట్లుగా ప్రధాని మోదీ తన వ్యాఖ్యలను వక్రీకరించారని చిదంబరం ఆరోపించారు. దౌత్యపరమైన ఒత్తిళ్లు వచ్చిన మాట వాస్తవమే అయినా, అంతిమంగా విదేశాంగ శాఖ సలహా మేరకే దౌత్య మార్గాన్ని ఎంచుకున్నామని, లొంగిపోయి కాదని ఆయన స్పష్టం చేశారు. ఈ వివాదంతో 26/11 దాడుల ఘటనపై మరోసారి రాజకీయ మాటల యుద్ధం మొదలైంది.

## లాయర్ రాకేశ్ కిశోర్ సభ్యత్వం రద్దు

న్యూఢిల్లీ: సీజేఐ బీఆర్ గవాయ్‌పైకి చెప్పు విసిరేందుకు యత్నించిన ఘటన తీవ్ర దుమారం రేపుతోంది. ఈ అనూహ్య పరిణామం నేపథ్యంలో, న్యాయవాది రాకేష్ కిషోర్‌పై సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఆయన తాత్కాలిక సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇటీవల చోటుచేసుకున్న ఈ ఘటనను ఎస్‌సీబీఏ తీవ్రంగా పరిగణించింది. రాకేష్ కిషోర్ తాత్కాలిక సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేస్తున్నామని, అసోసియేషన్ సభ్యుల జాబితా నుంచి ఆయన పేరును తొలగిస్తున్నామని ఎస్‌సీబీఏ ఓ తీర్మానంలో స్పష్టం చేసింది. ఈ మేరకు లైవ్ లా నివేదించింది. ఇదిలా ఉండగా, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) కూడా రాకేష్‌ను సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. మరోవైపు, ఆయనపై క్రిమినల్ కోర్టు ధిక్కారణ చర్యలు చేపట్టేందుకు కూడా రంగం సిద్ధమవుతోంది. 71 ఏళ్ల రాకేష్ కిషోర్‌పై చట్టపరమైన చర్యలు ప్రారంభించేందుకు అనుమతి కోరుతూ అటార్నీ జనరల్‌కు ఇప్పటికే ఓ లేఖ పంపినట్లు సమాచారం. ఈ ఘటన న్యాయవ్యవస్థలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.




## 799కే జియో సేఫ్టీ ఫోన్లు

**విద్యార్థులకు ఫ్రీగా ఏఐ కోర్సు**

ముంబై: ప్రముఖ టెలికాం సంస్థ రిలయన్స్ జియో మరోసారి మార్కెట్లో సంచలనానికి తెరలేపింది. ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ) 2025 వేదికగా భద్రతకు పెద్దపీట వేస్తూ కొత్త శ్రేణి 'జియోభారత్' ఫోన్లను ఆవిష్కరించింది. ముఖ్యంగా పిల్లలు, మహిళలు, వృద్ధుల భద్రతను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ 'సేఫ్టీ–ఫస్ట్' ఫోన్ల ప్రారంభ ధర కేవలం రూ.799 మాత్రమే కావడం విశేషం. దీంతో పాటు విద్యార్థుల కోసం ఉచితంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోర్సును కూడా ప్రకటించింది. ఈ కొత్త జియోభారత్ ఫోన్లలో లొకేషన్ ట్రాకింగ్, యూసేజ్ మేనేజ్‌మెంట్ వంటి కీలక ఫీచర్లను పొందుపరిచారు. లొకేషన్ ట్రాకింగ్ ద్వారా ఫోన్ వాడుతున్న వారు తమ రియల్–టైమ్ లొకేషన్‌ను నమ్మకమైన కాంటాక్ట్స్‌తో పంచుకోవచ్చు. ఇక 'యూసేజ్ మేనేజర్' టూల్ ద్వారా పిల్లలు లేదా వృద్ధుల ఫోన్‌కు ఎవరెవరు కాల్ చేయాలి, మెసేజ్ పంపాలి అనే దానిపై సంరక్షకులకు పూర్తి నియంత్రణ ఉంటుంది. దీనివల్ల గుర్తుతెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్‌ను సులభంగా బ్లాక్ చేయవచ్చు. ఒకసారి ఛార్జ్ చేస్తే ఏకంగా ఏడు రోజుల వరకు బ్యాటరీ లైఫ్ రావడం ఈ ఫోన్ల మరో ప్రత్యేకత. ఈ ఫోన్లు జియో స్టోర్లు, జియోమార్ట్, అమెజాన్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ సహా ఇతర ఆఫ్‌లైన్ రిటైల్ దుకాణాల్లో అందుబాటులో ఉంటాయని కంపెనీ తెలిపింది. అనవసరమైన కాల్స్, సోషల్ మీడియా వంటి వాటి నుంచి తమ ఆత్మీయులను దూరంగా ఉంచాలనుకునే కుటుంబాలకు ఈ ఫోన్లు ఎంతగానో ఉపయోగపడతాయని జియో పేర్కొంది. ఇదే కార్యక్రమంలో జియో మరో కీలక ప్రకటన చేసింది. విద్యార్థుల్లో ఏఐ పరిజ్ఞానాన్ని పెంచే లక్ష్యంతో 'జియో ఏఐ క్లాస్‌రూమ్' పేరుతో ఉచిత ఫౌండేషన్ కోర్సును ప్రారంభిస్తున్నట్లు తెలిపింది. జియో ఇన్‌స్టిట్యూట్‌తో కలిసి రూపొందించిన ఈ కోర్సును జియోపీసీ ద్వారా పీసీలు, ల్యాప్‌టాప్‌లు, జియో సెట్–టాప్ బాక్సుల సహాయంతో స్మార్ట్ టీవీల్లో యాక్సెస్ చేయవచ్చు. నాలుగు వారాల పాటు సాగే ఈ కార్యక్రమంలో ఏఐ ప్రాథమిక అంశాలు, ప్రాంప్ట్ ఇంజనీరింగ్ వంటి విషయాలపై శిక్షణ ఇస్తారు. కోర్సు పూర్తి చేసిన వారికి డిజిటల్ బ్యాడ్జ్‌తో పాటు, జియోపీసీ యూజర్లకు జియో ఇన్‌స్టిట్యూట్ నుంచి సర్టిఫికెట్ కూడా అందిస్తారు.

## ప్రపంచ ఆర్థికానికి భారత్ ఇంజిన్

**ఐఎంఎఫ్ చీఫ్ క్రిస్టలినా కీలక వ్యాఖ్యలు**

**భారత్ వృద్ధి అంచనాలను 6.5 శాతానికి పెంపు**

వాషింగ్టన్: ప్రపంచ ఆర్థిక సమీకరణాలు మారుతున్న ప్రస్తుత తరుణంలో, భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచ వృద్ధికి కీలక ఇంజిన్‌గా మారిందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టలినా జార్జియేవా ప్రశంసించారు. ప్రపంచవ్యాప్తంగా వృద్ధి రేటు నెమ్మదిస్తున్నప్పటికీ, భారత్ మాత్రం స్థిరంగా దూసుకెళుతోందని ఆమె పేర్కొన్నారు. వచ్చే వారం వాషింగ్టన్‌లో ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ వార్షిక సమావేశాలు జరగనున్న నేపథ్యంలో జార్జియేవా ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. "ప్రపంచవ్యాప్తంగా వృద్ధి సరళిలో మార్పులు వస్తున్నాయి. ముఖ్యంగా చైనా వృద్ధి క్రమంగా మందగిస్తుండగా, భారత్ ఒక కీలక వృద్ధి చోదక శక్తిగా అభివృద్ధి చెందుతోంది" అని ఆమె వివరించారు. కరోనాకు ముందు ప్రపంచ వృద్ధి రేటు 3.7 శాతంగా ఉండగా, ప్రస్తుతం మధ్యకాలికంగా అది 3 శాతం వద్దే కొనసాగుతుందని అంచనా వేశారు. అంతర్జాతీయంగా ఆర్థిక వ్యవస్థలు అనేక ఒడిదొడుకులను తట్టుకుని నిలబడ్డాయని చెబుతూనే, ఇంకా పూర్తిస్థాయిలో పరీక్షలు ఎదురుకాలేదని, కాబట్టి ఇప్పుడే ఊపిరి పీల్చుకోవడం తొందరపాటు అవుతుందని ఆమె హెచ్చరించారు. ఐఎంఎఫ్ మాత్రమే కాకుండా ఇతర ప్రముఖ ఆర్థిక సంస్థలు కూడా భారత్‌పై సానుకూల దృక్పథంతో ఉన్నాయి. ప్రపంచ బ్యాంకు, 2026 ఆర్థిక సంవత్సరానికి గాను భారత వృద్ధి అంచనాను 6.3 శాతం నుంచి 6.5 శాతానికి పెంచింది. ఇదే బాటలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కూడా 2025–26 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను 6.5 శాతం నుంచి 6.8 శాతానికి సవరించింది. గత వారం ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ, జీఎస్టీ వంటి నిర్మాణాత్మక సంస్కరణలు, బలమైన ప్రైవేట్ వినియోగం, స్థిర పెట్టుబడుల కారణంగానే ఈ వృద్ధి సాధ్యమవుతోందని తెలిపారు. 2025–26 మొదటి త్రైమాసికంలో భారత జీడీపీ 7.8 శాతం మేర బలమైన వృద్ధిని నమోదు చేసిందని ఆయన గుర్తు చేశారు. మంచి వర్షపాతంతో గ్రామీణ డిమాండ్ బలంగా ఉండగా, పట్టణ ప్రాంతాల్లో కూడా డిమాండ్ క్రమంగా పుంజుకుంటోందని ఆయన పేర్కొన్నారు.

## మహావతార్ బాబాజీ గుహలో రజనీకాంత్ ధ్యానం

సిమ్లా: తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ తన స్టార్‌డమ్‌కు, సినిమా హడావిడికి పూర్తిగా దూరంగా ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తున్నారు. ప్రస్తుతం ఆయన హిమాలయాల్లో పర్యటిస్తూ ప్రకృతి ఒడిలో సేద తీరుతున్నారు. ఈ పర్యటనకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తన ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా రజినీకాంత్ ప్రసిద్ధ మహావతార్ బాబాజీ గుహను సందర్శించారు. అక్కడ ధ్యానం చేసుకున్నారు. అంతకుముందు రిషికేశ్‌లోని స్వామి దయానంద ఆశ్రమంలో కొంత సమయం గడిపారు. అక్కడ గంగానది తీరంలో పవిత్ర హారతి కార్యక్రమంలోనూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సాధారణ భక్తుడిలా తెల్లటి దుస్తులు ధరించి, అక్కడి పూజారులతో, స్థానికులతో ముచ్చటిస్తూ కనిపించారు. కె. బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన 'అపూర్వ రాగంగళ్' చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేసిన రజినీకాంత్, దశాబ్దాల పాటు తన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు. తమిళంతో పాటు తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలకు గానూ పద్మభూషణ్, పద్మవిభూషణ్, దాదాసాహెబ్ ఫాల్కే వంటి అత్యున్నత పురస్కారాలు అందుకున్నారు.

## సాక్షమ్.. శత్రు డ్రోన్ల వేట

**దేశీయ పరిజ్ఞానంతో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ తయారీ**




న్యూఢిల్లీ: సరిహద్దుల్లో శత్రు దేశాల నుంచి డ్రోన్ల ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో, వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు భారత సైన్యం కీలక చర్యలు చేపట్టింది. పూర్తిగా దేశీయ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 'సాక్షమ్' అనే అత్యాధునిక కౌంటర్ డ్రోన్ వ్యవస్థను కొనుగోలు చేసే ప్రక్రియను ప్రారంభించింది. 'ఆత్మనిర్భర్ భారత్' స్ఫూర్తితో ఘజియాబాద్‌లోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ ఈ వ్యవస్థను రూపొందించింది. ఇటీవల జరిగిన 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్ ప్రయోగించిన దాదాపు 400 డ్రోన్లను భారత భద్రతా దళాలు విజయవంతంగా నిర్వీర్యం చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత, డ్రోన్లను ఎదుర్కోవడానికి ఒక పటిష్టమైన వ్యవస్థ అవసరాన్ని సైన్యం గుర్తించింది. ఈ నేపథ్యంలోనే 'సాక్షమ్' కొనుగోలుకు ఫాస్ట్ ట్రాక్ ప్రొక్యూర్‌మెంట్ విధానంలో ఆమోదం తెలిపింది. రాబోయే ఏడాదిలోగా ఈ వ్యవస్థను అన్ని సైనిక క్షేత్రాలకు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. గతంలో సైన్యం కేవలం భూభాగంపైనే దృష్టి సారించేది. కానీ ఆధునిక యుద్ధ తంత్రంలో భాగంగా, భూమికి 3,000 మీటర్ల (10,000 అడుగుల) ఎత్తు వరకు ఉన్న గగనతలాన్ని కూడా 'వ్యూహాత్మక యుద్ధ క్షేత్రం'గా పరిగణిస్తున్నారు. ఈ ప్రాంతంలో శత్రు డ్రోన్లు, విమానాలను గుర్తించి, వాటిని నాశనం చేస్తూనే.. మన వైమానిక దళాలకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడటమే 'సాక్షమ్' ప్రధాన లక్ష్యమని రక్షణ శాఖ అధికారులు వివరించారు. 'సాక్షమ్' వ్యవస్థ ఒక మాడ్యులర్ కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టమ్‌గా పనిచేస్తుంది. ఇది శత్రు డ్రోన్లను నిజ సమయంలో గుర్తించడం, ట్రాక్ చేయడం, వాటిని నిర్వీర్యం చేయడం వంటి పనులను చేస్తుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా పనిచేసే ఈ వ్యవస్థ, ముప్పును ముందుగానే పసిగట్టి కమాండర్లకు వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు సహకరిస్తుంది. సెన్సార్లు, సాఫ్ట్‌కిల్, హార్డ్‌కిల్ ఆయుధ వ్యవస్థలను ఒకే గొడుగు కిందకు తెచ్చి, గగనతలంలో పూర్తి స్థాయి భద్రతను అందిస్తుంది. రష్యా–ఉక్రెయిన్, ఇజ్రాయెల్–పాలస్తీనా వంటి ఆధునిక యుద్ధాల్లో డ్రోన్ల పాత్ర పెరిగిన తరుణంలో, భారత సైన్యం ఈ వ్యవస్థను సమకూర్చుకోవడం వ్యూహాత్మకంగా ఎంతో కీలకమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.


## భారత్‌కు 'శాశ్వత' మద్దతు

**బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ వెల్లడి**

న్యూఢిల్లీ: ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం దక్కాలన్న వాదనకు బ్రిటన్ నుంచి బలమైన మద్దతు లభించింది. ప్రపంచ వేదికపై భారత్ తన 'సరైన స్థానాన్ని' పొందాలని యూకే ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ గురువారం స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఢిల్లీలోని రాజ్‌భవన్‌లో సమావేశమైన అనంతరం ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ సాధిస్తున్న అద్భుతమైన అభివృద్ధిని, అంతర్జాతీయ వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించగల సామర్థ్యాన్ని స్టార్మర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. "భద్రతా మండలిలో భారత్ తన హక్కుగా పొందాల్సిన స్థానాన్ని దక్కించుకోవడాన్ని మేము చూడాలనుకుంటున్నాం" అని ఆయన అన్నారు. భారత్ శాశ్వత సభ్యత్వానికి ఇప్పటికే అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, రష్యా వంటి దేశాలు మద్దతు తెలుపగా, ఇప్పుడు యూకే కూడా అదే బాటలో నిలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. తన భారత పర్యటన ఉద్దేశాన్ని వివరిస్తూ, గత దశాబ్ద కాలంలోనే అతిపెద్ద వాణిజ్య ప్రతినిధి బృందంతో తాను ఇక్కడికి వచ్చినట్లు స్టార్మర్ తెలిపారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య భాగస్వామ్యాన్ని రెట్టింపు చేయడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. సాంకేతికత, ఆవిష్కరణల రంగాల్లో భారత్, యూకేలు ప్రపంచ నాయకులుగా కలిసి నిలుస్తున్నాయని చెప్పారు. ఈ పర్యటనలో భాగంగా యూకేలో బాలీవుడ్ చిత్రాల నిర్మాణానికి సంబంధించి ఒక ఒప్పందం కుదిరిందని కూడా ఆయన ప్రకటించారు. ఇదే సమయంలో, గాజాలో శాంతి ఒప్పందం మొదటి దశకు చేరుకోవడం పట్ల స్టార్మర్ హర్షం వ్యక్తం చేశారు.

## వయ్యారి చిత్రం




## నైజాంలో కాంతార1 రికార్డులు

కాంతార చాప్టర్ 1 సినిమా.. బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. కన్నడ ప్రముఖ నటుడు రిషబ్ శెట్టి లీడ్ రోల్ లో నటించి, దర్శకత్వం వహించిన ఆ మైథలాజికల్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ.. ఇప్పటికే రూ.400 కోట్ల క్లబ్ లోకి ఎంట్రీ ఇచ్చేసింది. రికార్డు స్థాయిలో వసూళ్లతో సందడి చేస్తున్న కాంతార ప్రీక్వెల్.. రూ.500 కోట్ల క్లబ్ వైపు పరుగులు పెడుతోంది. ఆరు రోజుల్లో రూ.427.5 కోట్లు సాధించినట్లు మేకర్స్ ఇటీవల ప్రకటించగా.. ఇప్పటివరకు వరల్డ్ వైడ్ గా రూ.475 కోట్లు సాధించినట్లు తెలుస్తోంది. వీక్ డేస్ లో కూడా సాలిడ్ కలెక్షన్స్ ను రాబడుతున్నట్లు స్పష్టంగా అర్థమవుతోంది. అయితే నైజాంలో కాంతార చాప్టర్ 1.. మొదటి వారం రూ.21.8 కోట్ల షేర్ ను సాధించినట్లు ఇప్పుడు ట్రేడ్ వర్గాల సమాచారం. కంప్లీట్ థియేట్రికల్ రన్ లో రూ.30 కోట్లకు పైగా షేర్ ను రాబట్టడం గ్యారెంటీగా తెలుస్తోంది. అది జరిగితే నైజాం ఏరియాలో కాంతార ప్రీక్వెల్ అరుదైన రికార్డును సొంతం చేసుకోనుంది. కేజీఎఫ్-2 సరసన చేరనుంది.

## వీవీ వినాయక్ రీఎంట్రీ..?

మాస్ డైరెక్టర్ వీవీ వినాయక్.. రీఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే విక్టరీ వెంకటేశ్‌కు ఓ స్క్రిప్ట్ వినిపించారుట. దీనిపై వెంకీ కూడా సానుకూలంగా స్పందించినట్లు వార్తలొస్తున్నాయి. ఇది వినాయక్ మార్క్ మాస్ ఎంటర్ టైనర్ గా ఉంటూనే ఓ కొత్త పాయింట్ రాసిన కథగా వినిపిస్తోంది. ఈ కథను సిద్ధం చేసింది వక్కంతం వంశీ అని తెలుస్తోంది. సురేష్ బాబు- నల్లమలపు బుజ్జి సంయుక్తంగా చిత్రాన్ని నిర్మించడానికి ముందకొస్తున్నట్లు సమాచారం. మరి ఈ కథను వంశీ ఏ పాయింట్ బేస్ మీద రాసాడు? అన్నది తెలియాలి. వంశీ కథలు ఈ మధ్య కాలంలో పెద్దగా సక్సెస్ అవ్వడం లేదు. రెగ్యులర్ కంటెంట్ గా బాక్సాఫీస్ వద్ద తేలిపోతున్నాయి. వంశీ ఇటీవలే నితిన్ హీరోగా ఎక్స్ ట్రా ఆర్డినరీ అనే ఓ సినిమా చేసిన సంగతి తెలిసిందే. ఆ నా పేరు సూర్య తర్వాత వంశీకి దర్శకుడిగా మరో వైఫ్యాలన్ని ఈ చిత్రం తీసుకుంది.




## వెబ్ సిరీస్‌లపై కిరణ్ అబ్బవరం ఇంట్రెస్ట్



టాలీవుడ్ హీరో కిరణ్ అబ్బవరం వెబ్‌సిరీస్‌లపై మనసు పారేసుకున్నాడట. ఓ సిరీస్‌కు రీసెంట్‌గా సైన్ చేశాడు. ఈ సిరీస్ ఫైనలైజ్ కూడా అయ్యిందట. ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియోస్ ఈ వెబ్ సిరీస్ ను నిర్మిస్తోంది. దీని షూటింగ్ 2027 ఫిబ్రవరిలో ప్రారంభం కానుందని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అయితే ఈ ప్రాజెక్ట్ ను కొత్త దర్శకుడు తెరకెక్కించనున్నారు. భరత్ కమ్మ షో రన్నర్ గా వ్యవహరిస్తారు. సినిమాల్లో సక్సెస్ అయిన కిరణ్.. సిరీస్ ల్లో ఏ మేరకు రాణిస్తాడో చూడాలి మరి. ఇక సిరీస్ ల విషయానికొస్తే.. సినిమాల కంటే వీటిని తక్కువ బడ్జెట్ తో నిర్మించవచ్చు. మార్కెటింగ్, ప్రమోషన్ కూడా ఈజీగా చేసుకోవచ్చు. థియేటర్ అడ్జస్ట్ మెంట్ గోల ఉండదు. కాంపిటీషన్ మాట అసలే లేదు. పైగా స్టార్లతోనే కాకుండా కొత్త వాళ్లను కూడా ఎంకరేజ్ చేసేందుకు అవకాశం ఉంటుంది. తక్కువ టైమ్ లోనే చిత్రీకరణ పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకురావొచ్చు. మరి ఆ రూట్లో కిరణ్ ఎలాంటి ఫలితాన్ని అందుకుంటాడో చూడాలి.

## రచ్చ చేస్తున్న అమైరా దస్తుర్

అమైరా దస్తూర్.. ఇటీవల మాల్దీవ్స్ కి వెకేషన్స్‌కి వెళ్ళిన ఈ బ్యూటీ బికినీలో రచ్చ చేస్తోంది. అక్కడి నుండి ఒక రిసార్ట్లో ఎంజాయ్ చేసిన ఫోటోలను అభిమానులతో పంచుకుంది. ఇందులో ప్రింటెడ్ ఆరెంజ్ కలర్ బికినీ ధరించి ఫోటోలకు ఫోజులు ఇచ్చింది. షిప్పులో, స్విమ్ చేస్తూ.. అక్కడి వాతావరణాన్ని ఎంజాయ్ చేస్తూ.. షేర్ చేసిన ఫోటోలు చూసే అభిమానులకు కూడా ఆహ్లాదకరంగా అనిపిస్తున్నాయని చెప్పవచ్చు. అంతేకాదు ఆమె తిన్న ఫుడ్ ఫోటోలను కూడా సోషల్ మీడియాలో పంచుకుంది అమైరా దస్తూర్. ప్రస్తుతం అమ్మడు షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అమైరా దస్తూర్ కెరియర్ విషయానికి వస్తే.. 1993 మే 7వ తేదీన ముంబై మహారాష్ట్రలో జన్మించింది. మోడల్ గా కెరియర్ ను మొదలుపెట్టిన ఈమె 2013లో హిందీ చిత్రం 'ఇసాక్' ద్వారా సినీ రంగ ప్రవేశం చేసింది. హిందీలోనే కాదు తెలుగు, తమిళ్ భాషల్లో కూడా సినిమాలు చేసి ప్రేక్షకులను మెప్పించింది. 2013లో ఇండస్ట్రీకి పరిచయమైన ఈమె.. 2018లో వచ్చిన 'మనసుకు నచ్చింది' అనే సినిమాతో ఇండస్ట్రీకి పరిచయమైంది.



## స్లమ్ డాగ్‌గా సేతుపతి-పూరి

పూరీ జగన్నాథ్ డబల్ ఇస్మార్ట్ తర్వాత మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతితో ఒక సినిమా లాక్ చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమా టైటిల్‌గా రకరకాల పేర్లు వినిపించాయి. ఫైనల్ గా స్లమ్ డాగ్ అనే పేరు ఫిక్స్ చేశారన్న టాక్ నడిచింది. ఐతే సినిమా నుంచి లేటెస్ట్ అప్డేట్ ఒకటి సినీ ప్రియులను సర్ ప్రైజ్ చేస్తుంది. ఈ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్‌గా హర్షవర్ధన్ రామేశ్వర్ ని లాక్ చేశారట. పూరీ, ఛార్మీ కలిసి హర్షవర్ధన్ తో దిగిన ఫోటో షేర్ చేసి ఈ విషయాన్ని వెల్లడించారు. యానిమల్ సినిమాతో బిజిఎం కి నేషనల్ అవార్డ్ అందుకున్నాడు హర్షవర్ధన్. సందీప్ వంగాతో ఎప్పటి నుంచో పనిచేస్తున్నాడు హర్షవర్ధన్. ఐతే నెక్ట్స్ ప్రభాస్ తో చేస్తున్న స్పిరిట్ సినిమాకు కూడా హర్షవర్ధన్ మ్యూజిక్ అందిస్తున్నాడు. సో సందీప్ తో పాటు పూరీ జగన్నాథ్ కూడా హర్షవర్ధన్ టాలెంట్ ని యూజ్ చేసుకుంటున్నాడు. పూరీ జగన్నాథ్ తొలి సినిమా నుంచి మ్యూజిక్ విషయంలో ఆడియన్స్ కి సూపర్ ట్రీట్ ఇస్తూ వచ్చాడు.





## జోరు పెంచిన సమంత

టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సమంత, హీరోయిన్ గా నటించడమే కాకుండా లేడీ ఓరియెంటెడ్ సినిమాలతో కూడా అందరినీ ఆకట్టుకుంటున్నారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో సినిమాలు, వెబ్‌సిరీస్‌లు చేస్తూ ఆడియన్స్ ను అలరిస్తున్న సమంత, పర్సనల్ రీజన్స్ వల్ల గత కొంతకాలంగా సైలెంట్ అయిన విషయం తెలిసిందే. ఇప్పుడు మళ్లీ ఇండస్ట్రీలో కంబ్యాక్ ఇవ్వాలని వరుస సినిమాలకు, వెబ్‌సిరీస్‌లకు సైన్ చేస్తున్నారు సమంత. అయితే సమంత కేవలం నటిగానే కాకుండా ఎంట్రప్రెన్యూర్ గా కూడా రాణిస్తున్నారు. ఆల్రెడీ సాకి, ఓ పెర్ఫ్యూమ్ లైన్ మరియు ఏకాం లాంటి స్కూల్ బ్రాండ్స్ కు ఓనర్ అయిన సమంత ఇప్పుడు తాజాగా బ్రాండ్ అంబాసిడర్ గా బాధ్యతలు చేపట్టారు. ప్రముఖ ఆభరణాల సంస్థ జోయాలుక్కాస్ తాజాగా తమ ప్రచారకర్తగా సమంతను నియమించింది. ఇంటర్నేషనల్ మార్కెట్ లో తమ డిజైన్లు, ఆభరణాల నైపుణ్యాన్ని సమంత తనదైన శైలిలో పరిచయం చేస్తారని సంస్థ చైర్మన్ జాయ్ ఆలుక్కాస్ అన్నారు. నేటి మహిళల ఆత్మవిశ్వాసం, శైలి, ప్రత్యేక గుర్తింపును సమంత ప్రతిబింబించనున్నారని, ఆమె జోయాలుక్కాస్ ఫ్యామిలీలో భాగమవడం చాలా సంతోషంగా ఉందని ఆయన చెప్పారు. కాగా జోయాలుక్కాస్ కు బ్రాండ్ అంబాసిడర్ గా ఉన్న సమంత, ఆభరణాలు ఎప్పుడూ వ్యక్తిగత శైలిని తెలియచేసే మార్గంగా తాను భావిస్తానని, ప్రతీ జ్యువలరీ వెనుక ఎన్నో ఎమోషన్స్, సెలబ్రేషన్స్ తో లాంటివి జోయాలుక్కాస్ లో ఉన్నాయని, అందానికి ప్రాధాన్యతనిచ్చే ప్రతీ మహిళను ఆత్మవిశ్వాసంతో ప్రకాశించేలా ప్రోత్సహించే బ్రాండ్ తో కలిసి వర్క్ చేయడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు.





# భారత్‌కు తొలి షాక్

మహిళల వన్డే ప్రపంచకప్‌లో సఫారీల గెలుపు

వైజాగ్, అక్టోబర్ 9 (ఈవార్తలు): మహిళల వన్డే ప్రపంచ కప్ 2025లో భారత్ తొలి ఓటమి చవిచూసింది. సౌతాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో 3 వికెట్ల తేడాతో ఓడింది. రిచా ఘోష్ (94) మెరవడంతో తొలుత భారత్ 251 పరుగులకు ఆలౌటైంది. ఈ లక్ష్యాన్ని సఫారీలు 48.5 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి ఛేదించారు. నాడిన్ డిక్లర్క్ (84బీ 54 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్స్‌లు) చెలరేగింది. కెప్టెన్ వొల్వార్ట్ (70బీ 111 బంతుల్లో 8 ఫోర్లు), క్లో ట్రైయాన్ (49బీ 66 బంతుల్లో 5 ఫోర్లు) రాణించారు. ఒక దశలో సౌతాఫ్రికా 81 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. ఈ క్రమంలో ట్రైయాన్‌తో కలిసి వొల్వార్ట్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దింది. వొల్వార్ట్ ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన డిక్లర్క్.. ఆరంభంలో నెమ్మదిగానే ఆడింది. దీంతో 45 ఓవర్లకు సౌతాఫ్రికా 200/6తో నిలవడంతో భారత్‌కే విజయావకాశాలు కనిపించాయి. అప్పటికి డిక్లర్క్ 36 బంతుల్లో 34 పరుగులు చేసింది. తర్వాత నాడిన్ ఒక్కసారిగా గేర్లు మార్చి ఆడింది. రాణా బౌలింగ్‌లో సిక్స్, ఫోర్ రాబట్టిన నాడిన్.. క్రాంతి వేసిన తర్వాతి ఓవర్‌లో వరుసగా 6, 6,4 బాదేసింది. దీప్తి బౌలింగ్‌లో రెండు ఫోర్లు, అమన్‌జ్యోత్ వేసిన 49 ఓవర్‌లో రెండు సిక్స్‌లు కొట్టి భారత్ హ్యాట్రిక్ విజయం ఆశలపై నీళ్లుచల్లింది. భారత బౌలర్లలో క్రాంతి 2, స్నేహ్ రాణా 2, అమన్‌జ్యోత్, శ్రీ చరణి, దీప్తి శర్మ ఒక్కో వికెట్ పడగొట్టారు. భారత బ్యాటర్లు విఫలమైన వేళ ఎనిమిదో స్థానంలో వచ్చిన రిచా ఘోష్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి జట్టును ఆదుకుంది. ఓపెనర్లు ప్రతీకా రావల్ (37), స్మృతి మంధాన (23) శుభారంభం అందించినా తర్వాత వచ్చిన బ్యాటర్లు నిరాశపర్చారు. హర్లీన్ డియోల్ (13), హర్మన్‌ప్రీత్ కౌర్ (9), దీప్తి శర్మ (4), జెమీమా రోడ్రిగ్స్ (0) విఫలమయ్యారు. స్నేహ్ రాణా (33) ఫర్వాలేదనిపించింది. ఒక దశలో 83/1తో ఉన్న భారత్.. ఉన్నట్టుండి వికెట్లు కోల్పోయి 102/6తో కష్టాల్లో పడింది. ఈ దశలో అమన్‌జ్యోత్, స్నేహ్ రాణాతో కలిసి రిచా ఘోష్ కీలక భాగస్వామ్యాలు నెలకొల్పింది. 53 బంతుల్లో అర్ధ శతకం అందుకున్న రిచా.. తర్వాత చెలరేగింది. ఆయబొంగా వేసిన 47 ఓవర్‌లో వరుసగా 4, 4, 6 బాదేసింది. 76, 83 వ్యక్తిగత స్కోరు వద్ద రిచాకు లైఫ్ వచ్చింది. ఆఖరి ఓవర్ ప్రారంభానికి ముందు 84 పరుగులతో ఉన్న రిచా.. మొదటి బంతికి రెండు పరుగులు తీసింది. తర్వాత వరుసగా రెండు ఫోర్లు బాదడంతో సెంచరీ చేసేలా కనిపించింది. కానీ, నాలుగో బంతికి భారీ షాట్ ఆడి లాంగాన్‌లో ట్రైయాన్‌కు చిక్కడంతో సెంచరీ మిస్ అయ్యింది.



## అందుకే రిటైర్మెంట్ తీసుకున్నా

నిరుడు ఆస్ట్రేలియా పర్యటన మధ్యలోనే వీడ్కోలు పలికి అందర్నీ ఆశ్చర్యపరిచాడు రవిచంద్రన్ అశ్విన్. తన రిటైర్మెంట్‌పై వస్తోన్న ఊహాగానాలకు తెరదించుతూ.. జట్టులో చోటు దక్కకపోవడంతోనే నిర్ణయం తీసుకున్నట్టు చెప్పాడీ లెజెండ్. దాంతో.. అప్పటి నుంచి అప్పటి కెప్టెన్ రోహిత్ శర్మ, కోచ్ గౌతం గంభీర్ ల ఒత్తిడితోనే అశ్విన్ అల్విదా చెప్పాడనే విమర్శలు జోరందుకున్నాయి. జట్టుకు ఎంతో సేవ చేసిన అతడిని అవమానపరిచారంటూ క్రీడాలోకం హిట్‌మ్యాన్, గౌతీలపై మండిపడుతోంది. ఈ నేపథ్యంలో స్పిన్ మాంత్రికుడు వివాదాలకు తెరదించుతూ కీలక విషయాలు పంచుకున్నాడు. తన యూబ్యూట్ ఛానెల్లో మాట్లాడుతూ తన వీడ్కోలుకు రోహిత్, గంభీర్ కారణం కాదని అశ్విన్ అన్నాడు. 'ఆస్ట్రేలియా సిరీస్ మూడో టెస్టు తర్వాత నేను వీడ్కోలు పలికాను. అయితే.. నువ్వు రిటైరవ్వు అని నాకు ఎవరూ చెప్పలేదు. జట్టులో నీకు చోటు లేదు అని కూడా కోచ్ గంభీర్‌గానీ, కెప్టెన్ రోహిత్‌గానీ నాతో అనలేదు. నిజానికి వీడ్కోలు ఆలోచనను ఇద్దరి ముగ్గురితో పంచుకున్నా. అప్పుడు వాళ్లు.. వద్దని వారించారు. రోహిత్, గంభీర్ కూడా కొన్నాళ్లు ఆడితే బాగుంటుంది. మరోసారి ఆలోచించుకో అని అన్నారు. కానీ, నేను వినలేదు. అయితే.. ఈ విషయంపై చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌తో మాత్రం మాట్లాడలేదు. రిటైర్మెంట్ తీసుకోవాలి అనేది పూర్తిగా నా సొంత నిర్ణయం. ఏ క్రికెటర్‌కైనా ఇది వ్యక్తిగత నిర్ణయం కదా' అని అశ్విన్ వెల్లడించాడు.



## నవంబర్ 25న డబ్ల్యూపీఎల్ వేలం

మహిళల క్రికెట్‌కు విశేష ఆదరణ కల్పించిన మహిళల ప్రీమియర్ లీగ్ మరో ఎడిషన్‌కు సిద్ధమవుతోంది. గత మూడు సీజన్లు అభిమానులను అలరించిన ఈ మెగా టోర్నీ నాలుగో సీజన్ రాబోతోంది. అంతకంటే ముందుగా వేలం నిర్వహణకు కసరత్తు జరుగుతోంది. నవంబర్ 25 లేదా 29న ఆక్షన్ జరిపేందుకు నిర్వాహకులు సన్నాహకాలు చేస్తున్నారు. ఈ ప్రక్రియలో భాగంగానే ఎంతమందిని అట్టిపెట్టుకోవాలి.. రైట్ టు మ్యాచ్.. వంటి వాటి గురించి ఫ్రాంచైజీలకు కీలక సూచనలు చేశారు. డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్ వేలం నేపథ్యంలో ఐదు ఫ్రాంచైజీలకు గురువారం నిర్వాహకులు ఈమెయిల్ పంపించారు. అందులో.. రీటైన్, ఆర్‌టీఎమ్, అన్‌క్యాప్డ్ ప్లేయర్లకు సంబంధించిన విషయాలను స్పష్టంగా పేర్కొన్నారు. ఈసారి ఐదుగురిని మాత్రమే అట్టిపెట్టుకునేందుకు ఫ్రాంచైజీలకు అనుమతిచ్చారు. ఇందులో గరిష్టంగా భారత క్రికెటర్లు ముగ్గురు.. విదేశీయులు ఇద్దరు ఉండాలని సూచించారు. భారత క్రికెటర్లలో ఇద్దరు అన్‌క్యాప్డ్ ప్లేయర్లను రీటైన్ చేసుకునేందుకు ఓకే చెప్పారు. నవంబర్ 5వ తేదీలోపే అన్ని యాజమాన్యాలు తమ రీటైన్ ప్లేయర్ల జాబితాను వెల్లడించాలని తెలిపారు. పేర్ల నమోదుకు నవంబర్ 18 ఆఖరు తేదీ. నవంబర్ 20న వేలంలో నిలిచిన ప్లేయర్ల పేర్లను బీసీసీఐ విడుదల చేయనుందని సమాచారం. ఐపీఎల్ మాదిరిగానే డబ్ల్యూపీఎల్‌లో రైట్ టు మ్యాచ్‌ను అనుమతిస్తూ నిర్వాహకులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఒక ఫ్రాంచైజీ ఐదు ఆర్టీఎమ్‌లో పాల్గొనవచ్చు. ఒకవేళ ఫ్రాంచైజీ నలుగురిని అట్టిపెట్టుకుంటే వాళ్లకు ఒకేఒక ఆర్‌టీఎమ్ ఛాన్స్ ఉంటుంది. అలానే ముగ్గురిని రీటైన్ చేసుకుంటే రెండు ఆర్‌టీఎమ్స్‌లో పాల్గొనవచ్చు. ఇద్దరిని రీటైన్ చేసుకుంటే..మూడు ఆర్‌టీఎమ్స్, ఒక్కరినే అట్టిపెట్టుకుంటే నాలుగు ఆర్‌టీఎమ్స్ లభిస్తాయి.

## కోహ్లీ, రోహిత్ అనుభవం మాక్కావాలి

టీమిండియా సీనియర్ ఆటగాళ్లు అయిన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ జట్టులో కొనసాగుతారని కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్పష్టం చేశాడు. వన్డే ప్రపంచకప్ 2027 లక్ష్యంగా వారి సన్నద్ధత కొనసాగుతోందని తెలిపాడు. వారి అనుభవం తమకు అవసరమని తెలిపాడు. వన్డే కెప్టెన్సీ బాధ్యతల నుంచి రోహిత్ శర్మను తొలగించి శుభ్‌మన్ గిల్‌ను నయా సారథిగా ఎంపిక చేసిన విషయం తెలిసిందే. వన్డే ప్రపంచకప్ 2027ను దృష్టిలో పెట్టుకునే ఈ నిర్ణయం తీసుకున్నామని భారత చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ తెలిపాడు. దాంతో కోహ్లీ, రోహిత్ వన్డే ప్రపంచకప్ ఆడటంపై సందేహాలు మొదలయ్యాయి. ఆస్ట్రేలియా పర్యటన అనంతరం ఈ ఇద్దరూ రిటైర్మెంట్ ప్రకటిస్తారనే వాదన కూడా తెరపైకి వచ్చింది. గురువారం నుంచి వెస్టిండీస్‌తో రెండో టెస్ట్ ప్రారంభం కానున్న నేపథ్యంలో శుభ్‌మన్ గిల్ బుధవారం మీడియాతో మాట్లాడాడు. ఈ సందర్భంగా వన్డే సారథ్యంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ శర్మలా ప్రశాంతంగా ఉంటూ.. జట్టులో స్నేహపూర్వకమైన వాతావరణాన్ని సృష్టిస్తానని తెలిపాడు. 'రోహిత్ శర్మ చాలా కూల్‌గా ఉంటాడు. కెప్టెన్‌గా అతను జట్టులో నెలకొల్పిన స్నేహపూర్వక వాతావరణాన్ని సారథిగా నేను కొనసాగిస్తా. చాలా మంది బయటి నుంచి చాలా రకాలుగా మాట్లాడుతుంటారు. రోహిత్, విరాట్ ప్రస్తుతం వన్డేల్లో కొనసాగుతున్నారు. వారిద్దరి భవితవ్యంపై కూడా ఊహాగానాలు వస్తున్నాయి. టీమిండియా కోసం ఎన్నో మ్యాచ్‌లు గెలిపించారు. వీరిద్దరూ అద్భుతమైన నైపుణ్యం కలిగిన క్రికెటర్లు. జట్టుకు వారి అవసరం చాలా ఉంది. వచ్చే వన్డే ప్రపంచ కప్ లక్ష్యంగా వారి సన్నద్ధత జరుగుతోంది. భవిష్యత్తులో ఏం జరుగుతుందో చెప్పలేం. నేను కూడా ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా. అయితే నేనెప్పుడూ వర్తమానంలో ఉండేందుకు ఇష్టపడుతా. అలాగే తంలో సాధించిన విజయాలు పట్టించుకోను. ప్రతీ మ్యాచ్‌లోనూ విజయం సాధించాలనే లక్ష్యంతో ముందుకుసాగుతాం. రాబోయే కొన్ని నెలలు మాకు చాలా ముఖ్యం.'అని గిల్ చెప్పుకొచ్చాడు. వెస్టిండీస్‌తో తొలి టెస్ట్‌లో ఇన్నింగ్స్ 140 పరుగుల తేడాతో గెలిచిన టీమిండియా.. రెండో టెస్ట్‌లోనూ అదే జోరు కొనసాగించాలనుకుంటుంది. ఈ మ్యాచ్ గెలిచి రెండు టెస్ట్‌ల సిరీస్‌ను 2–0తో క్లీన్ స్వీప్ చేయాలనే లక్ష్యంతో ఉంది. మరోవైపు రెండో టెస్ట్‌లో టీమిండియా ఎలాంటి మార్పులు లేకుండా బరిలోకి దిగుతుందని టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ తెలిపాడు. బుమ్రాకు రెస్ట్ ఇస్తారని ప్రచారం జరగ్గా.. ఈ వార్తలను అతను ఖండించాడు.



## సెహ్వాగ్ భార్యతో బీసీసీఐ చీఫ్ ఎఫైర్?

టీమిండియా మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ వైవాహిక జీవితంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) నయా ప్రెసిడెంట్ మిథున్ మన్హాస్ నిప్పులు పోసినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. సెహ్వాగ్ సతీమణి ఆర్తి అహ్లావత్‌తో మిథున్ మన్హాస్ సహజీవనం చేస్తున్నట్లు సోషల్ మీడియా కోడై కూస్తోంది. బీసీసీఐ ప్రెసిడెంట్‌గా ఎన్నికవ్వకముందే ఈ ఇద్దరి మధ్య ఎఫైర్ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఇద్దరు చనువుగా ఉన్న ఫొటోలు, వీడియోలు ఈ ప్రచారానికి బలం చేకూరుస్తున్నాయి. ఢిల్లీకి చెందిన మిథున్ మన్హాస్ ఇటీవలే బీసీసీఐ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. మాజీ ప్రెసిడెంట్ రోజర్ బిన్నీ పదవికాలం ముగియడంతో మిథున్ మన్హాస్‌ను కొత్త అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అంతర్జాతీయ క్రికెట్ ఆడిన అనుభవం మిథున్ మన్హాస్‌కు లేకపోయినా.. ఢిల్లీ తరఫున సుదీర్ఘ కాలం రంజీ క్రికెట్ ఆడాడు. ఆ జట్టుకు సారథ్యం కూడా వహించాడు. వీరేంద్ర సెహ్వాగ్‌కు మిథున్ మన్హాస్ మంచి స్నేహితుడు. ఈ క్రమంలోనే ఆర్తి అహ్లావత్‌తో అయిన పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసినట్లు ప్రచారం జరుగుతుంది. ఈ విషయం తెలిసే సెహ్వాగ్..ఆర్తి అహ్లావత్‌ను దూరం పెట్టాడనే వాదన కూడ వినిపిస్తోంది. గతేడాది సెహ్వాగ్ తన సతీమణి ఆర్తి అహ్లావత్‌కు విడాకులు ఇచ్చేందుకు సిద్ధమయ్యాడని వార్తలు వచ్చాయి. ఈ ఇద్దరూ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒకరినొకరు అన్‌ఫాలో కూడా చేసుకున్నారు. అప్పటి నుంచి సెహ్వాగ్, ఆర్తి అహ్లావత్ విడి విడిగా జీవిస్తున్నారు. ప్రస్తుతం వీరి విడాకుల అంశం కోర్టు పరిధిలో ఉన్నట్లు పలు నివేదికలు పేర్కొన్నాయి. ఇప్పటి వరకు అయితే ఈ విడాకుల వ్యవహారంపై సెహ్వాగ్, ఆర్తి అహ్లావత్ అధికారికంగా స్పందించలేదు.

## టీమిండియా ఆటగాళ్లకు గంభీర్ దావత్



వెస్టిండీస్‌తో రెండో టెస్ట్ కోసం న్యూఢిల్లీకి వచ్చిన భారత ఆటగాళ్లకు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ దావత్ ఇచ్చాడు. బుధవారం రాత్రి తన నివాసంలో జరిగిన ఈ డిన్నర్ కార్యక్రమానికి టీమిండియా ఆటగాళ్లు, సపోర్ట్ స్టాఫ్‌తో పాటు బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా హాజరయ్యారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్, జస్‌ప్రీత్ బుమ్రాలతో పాటు ఇతర ఆటగాళ్లు టీమ్ బస్‌లో గంభీర్ నివాసానికి చేరుకున్నారు. తన ఆతిథ్యాన్ని స్వీకరించేందుకు వచ్చిన ఆటగాళ్లు, సపోర్ట్ స్టాఫ్‌కు గంభీర్ దంపతులు స్వయంగా వడ్డించినట్లు తెలుస్తోంది.


## రోహిత్ వల్లే ఐసీసీ టైటిళ్లు: గంగూలీ



టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మపై బీసీసీఐ మాజీ ప్రెసిడెంట్ సౌరవ్ గంగూలీ ప్రశంసల జల్లు కురిపించాడు. రోహిత్ శర్మ అద్భుతమైన నాయకుడని కొనియాడాడు. అతని సారథ్యంలోనే టీమిండియా టీ20 ప్రపంచకప్ 2024 టోర్నీతో పాటు ఛాంపియన్స్ ట్రోఫీలో విజేతగా నిలిచిందని గుర్తు చేశాడు. ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపిక చేసిన జట్టు బాగుందని తెలిపాడు. ఇది అద్భుతమైన జట్టు అని, ఆటగాళ్లందరూ బాగా ఆడుతారని చెప్పాడు. వన్డే కెప్టెన్సీ బాధ్యతల నుంచి రోహిత్ శర్మను తొలగించి శుభ్‌మన్ గిల్‌ను నయా సారథిగా ఎంపిక చేసిన విషయం తెలిసిందే. వన్డే ప్రపంచకప్ 2027ను దృష్టిలో పెట్టుకునే ఈ నిర్ణయం తీసుకున్నామని భారత చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ తెలిపాడు. దాంతో కోహ్లీ, రోహిత్ వన్డే ప్రపంచకప్ ఆడటంపై సందేహాలు మొదలయ్యాయి. ఆస్ట్రేలియా పర్యటన అనంతరం ఈ ఇద్దరూ రిటైర్మెంట్ ప్రకటిస్తారనే వాదన కూడా తెరపైకి వచ్చింది. రోహిత్, కోహ్లీలు మాత్రం వన్డే ప్రపంచకప్ 2027 లక్ష్యంగా సన్నదమవుతున్నారు. తాజాగా మీడియాతో మాట్లాడిన గంగూలీని కెప్టెన్సీ మార్పు గురించి ప్రశ్నించగా.. కీలక వ్యాఖ్యలు చేశాడు. రోహిత్ శర్మ అనుమతితోనే కెప్టెన్సీ మార్పు చేశారని స్పష్టం చేశాడు

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
శుక్రవారం 10-10-2025 | www.evarthalu.com


# ఒత్తిడిని... చిత్తు చేద్దాం



మానసిక ఆరోగ్యం, మౌన గీతం,
హృదయంలో దాగిన సున్నిత రాగం..
కొన్ని సార్లు నవ్వు, కొన్ని సార్లు కన్నీరు..
మనసు ఒక సముద్రం, అలలెన్నో తాకీరు..
ఒత్తిడి గాలిలా, తుఫానై తాకితే,
ఆలోచనలు చీకటిలో దారి తప్పితే,
మాటలు కాసింత ఓదార్పు ఇస్తాయి.
ప్రేమ, ఆదరణ మనసును ఆదుకుంటాయి.
సమతుల్యం కోసం సమయం కావాలి,
మనసును వినడానికి ఓపిక కావాలి.
పుష్పం లాంటి ఈ మనసు జాగ్రత్త కోరే,
ప్రతి రోజూ కాస్త ప్రేమతో ఆరోగ్యం పొందే.
మౌనంలో బాధలు దాచకు స్నేహమా,
మాటల ద్వారా బయటపడు బాధలమ్మా.
మానసిక ఆరోగ్యం అన్నిటికీ మూలం,
దానిని కాపాడుకో, జీవన రాగం సుందరం

మానసిక ఆరోగ్యం అనేది వ్యక్తి మానసిక, భావోద్వేగ, సామాజిక శ్రేయస్సును సూచిస్తుంది. ఇది ఒక వ్యక్తి ఆలోచనలు, భావనలు, ప్రవర్తనను ఎలా నిర్వహిస్తాడో, ఒత్తిడిని ఎదుర్కొంటాడో, ఇతరులతో సంబంధాలు నెరపుతాడో, జీవితంలో నిర్ణయాలు తీసుకుంటాడో ప్రభావితం చేస్తుంది. మంచి మానసిక ఆరోగ్యం ఉన్న వ్యక్తి సాధారణంగా జీవితంలో సమతుల్యతను కాపాడుకోగలడు, సవాళ్లను ఎదుర్కోగలడు, సంతోషకరమైన, ఉత్పాదక జీవితాన్ని గడపగలడు. అయితే, మానసిక ఆరోగ్యం ప్రభావితమైనప్పుడు, డిప్రెషన్, ఆందోళన, బైపోలార్ డిజార్డర్, స్కిజోఫ్రీనియా, పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్ వంటి సమస్యలు తలెత్తవచ్చు. ఇవి వ్యక్తి రోజువారీ జీవితాన్ని, సంబంధాలను, ఉత్పాదకతను దెబ్బతీస్తాయి. ముఖ్యంగా భారత దేశంలో ఈ సమస్య అధిక శాతం మందిని వేధిస్తోంది.

మానసిక ఒత్తిడి అనేది ఆధునిక సమాజంలో విస్తృతంగా వ్యాపించిన సమస్య. భారతదేశం వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంలో ఇది మరింత తీవ్రమైన సవాలుగా మారింది. భారతదేశంలో జనాభా సాంద్రత, ఆర్థిక అసమానతలు, విద్యా, ఉద్యోగ ఒత్తిడి, సామాజిక అంచనాలు, సాంకేతికత వేగవంతమైన వృద్ధి వంటి అంశాలు మానసిక ఒత్తిడిని మరింత పెంచుతున్నాయి. విద్యార్థులపై పరీక్షల ఒత్తిడి, ఉద్యోగస్థులపై పని ఒత్తిడి, కుటుంబ సభ్యులపై సామాజిక బాధ్యతలు వంటివి ఉన్నాయి. మానసిక ఒత్తిడి శారీరక ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతోంది. ఇది రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు, జీర్ణ సమస్యలు, నిద్రలేమి వంటి సమస్యలకు దారితీస్తోంది. దీర్ఘకాల ఒత్తిడి రోగనిరోధక శక్తిని బలహీనపరుస్తుంది. దీనివల్ల వ్యాధులు ఆవహించేస్తున్నాయి. మరో సమస్య ఏంటంటే.. మన దేశంలో మానసిక ఆరోగ్య సమస్యలపై అవగాహన తక్కువగా ఉండటం అతి పెద్ద సమస్య. ఈ సమస్యను గుర్తించలేక, చికిత్స తీసుకోలేక ఇబ్బందులు పడుతున్నారు.



## 100 కోట్ల మందికి మానసిక రుగ్మతలు

ప్రపంచంలోని 100 కోట్లమందికి పైగా ప్రజలు మానసిక రుగ్మతలతో బాధపడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇటీవల తన నివేదికలో వెల్లడించింది. ప్రతి ఏడుగురిలో ఒకరికి మానసిక రుగ్మతలు ఉన్నాయని తెలిపింది. మొత్తం కేసుల్లో మూడింట రెండొంతుల మంది కుంగుబాటు, మానసిక ఆందోళన బాధితులే. మానసిక ఒత్తిడి, వ్యాకులత కారణంగా పెద్ద ఎత్తున ప్రాణ నష్టంతో పాటు ఆర్థికంగా కూడా నష్టం వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. యువత మరణాల్లో ఆత్మహత్యలు ప్రధానంగా ఉంటున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి 100 మరణాల్లో ఒక ఆత్మహత్య ఉంటుందని, 20 ఆత్మహత్యాయత్నాల తర్వాత ఒక మరణం చోటు చేసుకుంటుందని నివేదిక వెల్లడించింది. ప్రతి 200 మందిలో ఒకరు స్కిజోఫ్రెనియాకు, ప్రతి 150 మందిలో ఒకరు బైపోలార్ డిజార్డర్‌కు గురవుతున్నారని, ఇది చాలా ఇబ్బందికర పరిణామమని తెలిపింది. నిజానికి స్కిజోఫ్రెనియా మిగతా అనారోగ్య సమస్యలకు హేతువవుతోందని, చాలా ఖరీదైన జబ్బుగా పరిణమిస్తుందని వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా మానసిక రుగ్మతలున్న ప్రతి లక్షమందికి 13 మంది మానసిక ఆరోగ్య సిబ్బంది మాత్రమే ప్రస్తుతం సేవలందించగలుగుతున్నారని, ఈ సంఖ్య చాలా తక్కువ అని నివేదిక తెలిపింది. అనేక దేశాలు ఆరోగ్య రంగంపై పెట్టే వ్యయంలో 2 శాతం నిధులనే మానసిక ఆరోగ్యంపై వెచ్చిస్తున్నాయని, 2017 నుంచి ఈ ధోరణి మారడం లేదని ఆందోళన వ్యక్తం చేసింది. మానసిక ఆరోగ్యంపై పెడుతున్న వ్యయాన్ని ప్రజలపై పెడుతున్న వ్యయంగా చూడాలని సూచించింది.

## మహిళల్లో రెట్టింపు డిప్రెషన్

మహిళల్లో డిప్రెషన్ రేటు పురుషుల కంటే రెట్టింపు ఉంటుందట. పురుషుల కంటే మహిళల్లో దాదాపు 6,000 అదనపు జన్యు వైవిధ్యాలు ఉండటం వల్లే వారిలో డిప్రెషన్ వచ్చే ప్రమాదం గణనీయంగా పెరుగుతోందని తాజా అధ్యయనం పేర్కొంది. లింగ-నిర్దిష్ట జన్యు కారకాలే మహిళల్లో డిప్రెషన్ ప్రమాదాన్ని పెంచడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని నొక్కి చెప్పింది. అంటే, స్త్రీ, పురుషుల్లో మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపే జన్యువులు వేర్వేరుగా పనిచేస్తున్నాయని అర్థం. ఈ ప్రత్యేక జన్యు వైవిధ్యాలు డిప్రెషన్ రిస్క్‌ను మరింత పెంచుతున్నాయని, వీటి కారణంగానే మహిళలు తరచుగా మానసిక కుంగుబాటుకు లోనయ్యే అవకాశం ఎక్కువ ఉందని అధ్యయనం వెల్లడించింది. అధ్యయనంలో గుర్తించిన ఈ అదనపు జన్యు వైవిధ్యాలు మహిళల్లో వారసత్వంగా రావడానికి లేదా సహజంగా వారి శరీరంలో ఉద్భవించడానికి అవకాశం ఉందని పరిశోధకులు పేర్కొన్నారు. ఈ జన్యుపరమైన అంశం, డిప్రెషన్‌కు సంబంధించిన హార్మోన్ల మార్పులు, సామాజిక-పర్యావరణ ఒత్తిళ్లతో పాటు, మహిళల మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే మూడో ముఖ్యమైన కారకంగా నిలుస్తోంది. భవిష్యత్తులో డిప్రెషన్ చికిత్సలు, నివారణ పద్ధతులను అభివృద్ధి చేయడంలో ఈ జన్యుపరమైన సమాచారం ఎంతగానో ఉపయోగపడుతుందని నిపుణులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఫలితాలు వ్యక్తిగతీకరించిన వైద్యం దిశగా అడుగులు వేయడానికి దోహదపడతాయి. కేవలం సాధారణ వైద్యం కాకుండా, మహిళల జన్యు నిర్మాణాన్ని అర్థం చేసుకుని, దానికి అనుగుణంగా డిప్రెషన్‌ను ఎదుర్కొనే పద్ధతులను, చికిత్సలను రూపొందించేందుకు ఈ అధ్యయనం ఒక బలమైన పునాది వేసింది. ముఖ్యంగా, డిప్రెషన్‌కు సంబంధించిన రిస్క్ అంచనా, ముందస్తు జోక్యం విషయంలో ఈ కొత్త జన్యుపరమైన జ్ఞానం ఒక విప్లవాత్మక మార్పును తీసుకొస్తుంది.

## లక్షణాలను ఇలా గుర్తించండి..

ఇతరులతో చెప్పుకోవడానికి ఇష్టపడని ఆరోగ్య సమస్యల్లో మానసిక కుంగుబాటు ఒకటి. ఇలా దీని బారిన పడిన వారు దాని నుంచి బయటపడడం అంత సులభమేమి కాదు. ఆత్మహత్యకు దారి తీసే అవకాశం కూడా లేకపోలేదు. ఇలా ఈ సమస్య ప్రపంచవ్యాప్తంగా ఎంతోమందిని మానసిక వైకల్యం, ఇతర ఆరోగ్య సమస్యల బారిన పడేటట్లు చేస్తుంది. మానసిక కుంగుబాటు మొదలైతే ఆ వ్యక్తిలో కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. వాటిని తొలి దశలో గుర్తిస్తే డిప్రెషన్ బాధ నుంచి బయటపడి విముక్తి పొందవచ్చని మానసిక నిపుణులు అంటున్నారు. కుంగుబాటు మొదలయ్యే తొలి రోజుల్లో ప్రప్రథమంగా వారిలో ఏకాగ్రత లోపిస్తుంది. చిన్న చిన్న పనుల మీద కూడా సరైన దృష్టి పెట్టలేరు.

- **ఒంటరితనం:** కొందరు బిగ్గరగా ఏడుస్తారు. ఎక్కువగా ఒంటరితనాన్ని కోరుకుంటారు. మరికొందరు భావోద్వేగాలను ప్రదర్శించకుండా ముభావంగా అలా మారిపోతారు. ఎక్కువగా నిద్రపోయినా, నిద్రలేమి సమస్యతో ఇబ్బంది పడటం కూడా మానసిక కుంగుబాటుకు కారణంతో పాటు లక్షణాలుగా కూడా ఉన్నాయట.
- **అసహనం, తీవ్ర కోపం :** తీవ్ర ఒత్తిడిలో ఉన్న వ్యక్తులు స్థిమితంగా ఒకే చోట ఎక్కువ సేపు కూర్చోలేరు. చిన్న చిన్న విషయాలకే చిరాకు పడుతుంటారు. అసహనంతో తీవ్ర కోపం తెచ్చుకుంటారు. స్నేహితులు, కుటుంబ సభ్యులతో సరదాగా ఉండే వ్యక్తులు డిప్రెషన్‌కు గురైతే ఏ పనీ చేయకుండా అలా ఇంట్లోనే ఉండేందుకు ఎక్కువగా ఆసక్తి చూపిస్తారు. బయటి ప్రపంచం గురించి తెలుసుకోవాలనుకోరు.
- **ఏవేవో ఆలోచనలు:** ఏమీ జరగకపోయినా ఏదో చెడు జరగనుందని అనుకుంటూ మెదడుకు విశ్రాంతి ఇవ్వకుండా జరగబోయే దాని గురించి ఎక్కువగా ఆలోచిస్తూ దీర్ఘంగా ఉంటారు. తాను అనుభవిస్తున్న జీవితం అసలు తగినదేనా అనుకుంటారు. నువ్వు నాతో సంతోషంగా ఉన్నావా? అని సన్నిహితులను పదే పదే అడుగుతుంటారు.స్వీయ సంరక్షణ గురించి అసలు పట్టించుకోనే పట్టించుకోరు. ఏం తింటున్నారో ధ్యాస లేకుండా ఎక్కువగా ఎది పడితే అది తింటారు. ఒక్కోసారి ఆహారం పూర్తిగా తీసుకోరు.



శశిధర్ అక్కెల


# ఓం నమో భగవతే వాసుదేవాయ



రాం మనోహర్ శర్మ
బండపెల్లి
ఆధ్యాత్మిక పండితుడు

ఒక వృద్ధుడు చేతిలో జపమాల, మెడలో రుద్రాక్షహారం ధరించి, 'ఓం నమో భగవతే వాసుదేవాయ అనే మంత్రాన్ని జపిస్తూ గంగానది తీరంలో నడుస్తున్నాడు. ఆ తరంగాలు కలిపురుషుని తాకాయి. ఎక్కడి నుండి వస్తున్నది మంత్ర శబ్దం అని చుట్టూ పరికించాడు. గంగానదీ తీరంలో ఒక బక్కచిక్కిన ముదుసలి 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అనే నామాన్ని జపించడం చూసి ఆ మంత్ర జపాన్ని ఆపాలని ఆ ముసలివాడి దగ్గరికి వెళ్లి పట్టుకోబోయాడు

. అయన మీద చేయి వేసిన వెంటనే ఎగిరి యోజనం దూరంలో పడ్డాడు. ఆ దెబ్బకి కలిపురుషుడు గజగజ వణికిపో యాడు. 'ఇతన్ని చూస్తే బక్కచిక్కి ఉన్నాడు. గట్టిగా గాలి వస్తే ఎగిరేలా ఉన్నాడు. కానీ పట్టుకుందామంటే నేను ఎక్కడో పడుతున్నాను. ఒకవేళ నా శక్తి సన్నగిల్లిందా? లేక ఇదంతా శ్రీకృష్ణుడి మాయా ప్రభావమా? అసలు ఇంతకీ ఆ ముసలివాడు ఎవడు? శివుడా? విష్ణువా?' అనుకుంటూ ఉండగా అటుగా వెళ్తున్న వేదవ్యాసుడు కనిపించాడు. కలి వెంటనే వ్యాసుడి దగ్గరికి వెళ్లి "మహానుభావా! సమయానికి వచ్చావు. నా సందేహాన్ని నివృత్తి చెయ్యి. అదిగో ఆ దూరంగా వెళ్తున్నాడే ఆ ముసలివాడు.. ఎవరు? ఆయన్ని పట్టుకోబోతే నా బలం సరిపోవడం లేదు. ఇదసలు నా రాజ్యమేనా? లేక మీరందరూ కలిసి నన్ను మాయ చేస్తున్నారా? చెప్పండి" అని వేడుకున్నాడు. వేదవ్యాసుడు నవ్వి, "ఓహో అదా నీ సందేహం. అయన పరమ విష్ణుభక్తుడు. అయన జపించే నామం వలన విష్ణు శక్తి ఉత్పన్నమై నిన్ను దగ్గరికి రానివ్వదు. పట్టుకోవాలని ప్రయత్నించావా! విష్ణువు నిన్ను నాశనం చేసి కలియుగాన్నే లేకుండా చేస్తాడు. త్రికరణ శుద్ధిగా నిత్యం 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అనే నామాన్ని ఎవరు పఠిస్తూ ఉంటారో వారిని నువ్వు కనీసం తాకను కూడా తాకలేవు' అని చెప్పి వెళ్ళిపోయాడు. ఆ నాటినుంచి కలిపురుషుడు వీలయినంత వరకు హరినామస్మరణ జరగకుండా అడ్డుపడుతూ, ఆటంకాలు సృష్టిస్తూ ఉన్నాడు. పుణ్యపురుషులు భగవన్నామ స్మరణ జరిగేలా చూస్తూనే ఉన్నారు. అందుకే ధర్మం ఈ మాత్రం ఒంటి కాలిమీదనైనా నిలబడగలుగుతోంది.



OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.